జూలై నుంచి రాగులు, సజ్జల పంపిణీ

తిరుపతి(నేరవిభాగం), జూన్ 14(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుదారులకు వచ్చే నెల నుంచి ఉచిత బియ్యంతోపాటు కందిపప్పు,చక్కెర, రాగులు, సజ్జలు పంపిణీ చేయడానికి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. దీనికి సంబంధించి ఏర్పాట్లు చేసుకోవాలని రేషన్ షాపు డీలర్లకు ఆదేశాలు జారీ చేసింది.



జాతీయ స్థాయి ర్యాంకులు సాధించిన ఉమ్మడి జిల్లా విద్యార్థులు

నీట్‌లో మెరిశారు



కుటుంబీకులతో విశ్వక్ అగర్వాల్ - ఒ.ఆరుష్ లక్ష్మణ్



కుటుంబీకులతో ఆనందం పంచుకుంటున్న జ్ఞానీషారెడ్డి, యశ్వంత్, దేవేంద్రన్, మౌనిక, హరిత, గుణభూషణ్

తిరుతి(విద్య), జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల ప్రవేశాల కోసం నిర్వహించే జాతీయ అర్హత, ప్రవేశ పరీక్ష నీట్‌లో జిల్లా విద్యార్థులు సత్తా చాటారు. మే 4వ తేదీన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ ఆధ్వర్యంలో జరిగిన పరీక్షకు దేశవ్యాప్తంగా 24 లక్షలమంది హాజరుకాగా జిల్లా నుంచి 4,333 మంది రాశారు. ఎన్‌టీఏ శుక్రవారం ఈ ఫలితాలను విడుదల చేసింది. జిల్లా విద్యార్థులు జనరల్, వివిధ కేటగిరీల్లో జాతీయ స్థాయి ర్యాంకులు సాధించారు. తిరుపతికి చెందిన ఇంజినీర్ మహేష్, పద్మావతి దంపతుల కుమారుడు కుంచెపు విశ్వక్ అగర్వాల్ 573 మార్కులతో కేటగిరీ విభాగంలో 114, జనరల్లో 4,747 ర్యాంకు సాధించాడు. ప్రైవేట్ వైద్యులు డాక్టర్ కిరణ్, డాక్టర్ శైలజ కుమారుడు ఒ.ఆరుష్ లక్ష్మణ్ 337వ ర్యాంకు సాధించాడు. డాక్టర్ సతీష్ చంద్ర, డాక్టర్ పావని కుమార్తె చప్పిడి జ్ఞానీషారెడ్డి 607 మార్కులతో 582 కేటగిరీ ర్యాంకు, 934 జనరల్ ర్యాంకు సాధించాడు. డెంటల్ సర్జన్లు డాక్టర్ ఈశ్వర్, డాక్టర్ శాంతకుమారి కుమారుడు వి.యశ్వంత్ 1,024 కేటగిరీ ర్యాంకు సాధించారు. చిత్తూరుకు చెందిన రైతు వెంకటేశ్వర్లు, కమల దంపతుల కుమారుడు దేవేంద్రన్ 1,365 కేటగిరీ ర్యాంకు సాధించాడు. చంద్రగిరి హెడ్ పోస్టాఫీస్ పోస్టల్ అసిస్టెంట్ హేమంత్‌కుమార్, శ్రీలత కుమార్తె అలుగంటి మౌనిక 587 మార్కులతో కేటగిరీ విభాగంలో 1,393వ ర్యాంకు, 2,567 జనరల్ ర్యాంకు సాధించింది. మైదకూరుకు చెందిన ఉపాధ్యాయులు గంగులయ్య, చిన్నక్క దంపతుల కుమార్తె ఎన్.హరిత 2,121 ర్యాంకు సాధించింది. తిరుపతికి చెందిన ప్రైవేట్ ఉద్యోగి విజయ్‌కుమార్, యామిని దంపతుల కుమారుడు జి.గుణభూషణ్ 2,460 కేటగిరీ ర్యాంకు సాధించాడు. తిరుపతికి చెందిన వ్యాపారి డి.గోపి, భార్గవిల కుమార్తె దాసరి కీర్తి 557 మార్కులతో కేటగిరీ విభాగంలో 3,831 ర్యాంకు సాధించింది. వీరందరూ తిరుపతిలోని నారాయణ, చైతన్య కళాశాలల్లో చదివారు.



ఆనందంతో కీర్తి

'తోతాపురి'కి మద్దతు ధర ఇవ్వాల్సిందే

8



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు. చిత్రంలో చిత్తూరు ఎంపీ ప్రసాదరావు, ఎమ్మెల్యేలు నాని, జగన్మోహన్, మురళీమోహన్, కలెక్టర్ వెంకటేశ్వర్

వైసీపీ మిగిల్చిన చెత్త, రుణాన్ని క్లియర్ చేస్తున్నాం



డంపింగ్ యార్డు వద్ద అధికారులతో మాట్లాడుతున్న మంత్రి నారాయణ



తిరుపతిపై రైల్వేల చిన్నచూపు

8

21 నుంచి పాలిసెట్ వెబ్ కౌన్సెలింగ్

తిరుపతి(విద్య), జూన్ 14(ఆంధ్రజ్యోతి): పాలీసెట్ వెబ్ కౌన్సెలింగ్ ఈ నెల 21వ తేదీ నుంచి 28 వరకు తిరుపతిలోని ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో జరగనుందని కళాశాల ప్రిన్సిపాల్ వై.ద్వారకనాథరెడ్డి తెలిపారు. పాలిసెట్ ప్రవేశ పరీక్షలో అర్హత సాధించిన విద్యార్థులు డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలు పొందేందుకు కౌన్సెలింగ్‌కు ర్యాంకుల వారీగా హాజరుకావాలని సూచించారు. జిల్లాలో స్థానిక ఎస్వీ ప్రభుత్వ పాలిటెక్నిక్‌తోపాటు గూడూరు, సత్యవేడులోని హెల్ప్‌లైన్ సెంటర్లలో విద్యార్థులు ర్యాంకుల వారీగా హాజరై సర్టిఫికెట్లను వెరిఫై చేయించుకోవాలని తెలిపారు. హాజరయ్యే జనరల్ అభ్యర్థులు రూ.700, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులు రూ.240లు ప్రాసెసింగ్ రుసుం చెల్లించి రసీదును ప్రింట్ తీసుకోవాలని సూచించారు. రసీదుతోపాటు పాలిసెట్ హాల్‌టికెట్, ర్యాంక్ కార్డు, ఎస్సెస్సీ మార్కులలిస్టు ఒరిజినల్ లేదా ఇంటర్నెట్ కాపీ, 4 నుంచి 10వ తరగతి వరకు స్టడీ సర్టిఫికెట్లు, 2025-26 ఆదాయ సర్టిఫికెట్, బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు కుల ధ్రువీకరణ పత్రం, ఒరిజినల్‌తోపాటు రెండు సెట్లు జిరాక్స్ కాపీ సెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాల్సి ఉంటుందని వివరించారు. పీడబ్ల్యుడీ, క్యాప్, ఎన్‌సీసీ, స్పోర్ట్స్ అండ్ గేమ్స్, స్కౌట్స్ అండ్ గైడ్స్ స్పెషల్ కేటగిరీ అభ్యర్థులు విజయవాడలో కౌన్సెలింగ్‌కు హాజరుకావాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఇతర వివరాలకు సమీపంలోని పాలిటెక్నిక్ కళాశాలల్లోని హెల్ప్‌లైన్ సెంటర్లలోగాని, పాలిసెట్ కౌన్సెలింగ్ ఇన్‌చార్జిని (94925 26080) గాని సంప్రదించాలని తెలిపారు.

IN THE COURT OF THE HON'BLE V ADDITIONAL DISTRICT JUDGE:: TIRUPATI

O.E.P. No.90/2023, O.S.No.257/2015

1) Mr. S.Darshan sundeep, 2) Mr. S.Omkar Sanjay ... Decree Holders

Vs.

M/s Marg Business Park Pvt. Ltd., Rep by Power of attorney Agent, Development Agreement Holder, M/s MARG Ltd., Having office at 4/318, old Mahabalipuram Road, Kottiwakkam, Chennai - 600041, Tamil Nadu, India and Others .. Judgement Debtors

వేలం ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడమేమనగా పై కనిన ఇ.పి.నందు డిక్రీ హోల్డర్స్‌కు రావలసిన డబ్బు వసూలు నిమిత్తం జడ్జిమెంటు డెటార్స్ యొక్క క్రింద కనిన షెడ్యూలు దాఖలా స్థిరాస్తి వేలమునకు తెచ్చియున్నారు. వేలంలో పాల్గొనదలచినవారు 03.07.2025వతేదీన పై తెలిపిన కోర్టు నందు ఉ.10.30 గం॥లకు పాల్గొని వేలం షరతులకు లోబడి వేలంలో పాల్గొనవచ్చును.

వేలం తేది: 03.07.2025

SCHEDULE

ITEM No.1: Schedule -A: All the portion of the land area to the extent of Acres 7.24 cents, in Survey Nos 18/3A, 18/4A, 18/4B, 24/1, 27/1, 28, 30/1, 30/2, 30/3A, 30/3B, 30/4 to 30/8, 32/1, 32/2, 35/2, 35/3, 35/4, 36/1 & 186/2 situated at Kotramangalam Village, Renigunta Mandal, Chittoor Distrct Under SRO Renigunta nd bounded as under : North by : 18 meter road and Land in Sy.No. 188/1 & 188/2, South by : Others land, East by : Others land, West by Land in Sy.No.35/4 (part) & Others land

Schedule -B: (Undivided share of land agreed to be sold to the purchaser) 327 Sq.ft (36 Sq.yds) of Undivided share of land in 17,633 sq.mts or 4 Acres and 36 cents excluding roads and Totlot (OSR) measuring an extent of 13,080 sq.meter or 3 acres & 23 cents out of total land area of 7 Acres and 24 cents as mentioned in Schedule A Property (Divided as per the occupancy percentage of Flat area) together with a non-exclusive right of way and right to use the common area along with other purchasers.

Schedule-C: A Residential apartment consisting of Two Bedroom Hall Kitcehn having total super built up area of 1165 sq.ft bearing No. 803 in the F8 Floot in Block "F" (Block No.202) including proportionate share in the constructed in the common area of the building known as Vishwasakthi Phase-II to be constructed in the property mentioned in the Schedule-A above written delineated and colored in the floor plan annexed hereto. Bounded by East by : Corridor, West by : Open to Sky, South: Open to Sky and then Flat no.802, North by : Open to sky

Decree holders Value: Rs.15,00,000-00 Market Value : Rs. 26,67,850-00

ITEM No.2: Schedule -A: All the portion of the land area to the extent of Acres 7.24 cents, in Survey Nos 18/3A, 18/4A, 18/4B, 24/1, 27/1, 28, 30/1, 30/2, 30/3A, 30/3B, 30/4 to 30/8, 32/1, 32/2, 35/2, 35/3, 35/4, 36/1 & 186/2 situated at Kotramangalam Village, Renigunta Mandal, Chittoor Distrct Under SRO Renigunta nd bounded as under : North by : 18 meter road and Land in Sy.No. 188/1 & 188/2, South by : Others land, East by : Others land, West by Land in Sy.No.35/4 (part) & Others land

Schedule -B: (Undivided share of land agreed to be sold to the purchaser) 409 Sq.ft (45.53 Sq.yds) of Undivided share of land in 17,633 sq.mts or 4 Acres and 36 cents excluding roads and Totlot (OSR) measuring an extent of 13,080 sq.meter or 3 acres & 23 cents out of total land area of 7 Acres and 24 cents as mentioned in Schedule A Property (Divided as per the occupancy percentage of the Flat area) together with a non-exclusive right of way and right to use the common area along with other purchasers.

Schedule-C: A Residential apartment consisting of Three Bedroom Hall Kitchen having total super built up area of 1460 sq.ft bearing No. 807 in the 8th Floor, in Block "G" (Block No.202) including proportionate share in the constructed in the common area of the building known as Vishwasakthi Phase-II to be constructed in the property mentioned in the Schedule-A above written delineated and colored in the floor plan annexed hereto. Bounded by East by : Corridor, West by : Open to Sky, South: Open to Sky , North by : Open to sky

Decree holders Value: Rs.20,00,000-00 Market Value : Rs. 33,43,400-00

Note : EC is for the period of 30 years ie. from 01-01-1995 to 08-07-2024

No Encumbrances on the Schedule Property

// BY ORDER OF THE HON'BLE COURT//

Y.K.V. ARJUNA REDDY, N.RAVINDRA,

Advocates of the D.Hrs., Tirupati - Cell:96663 23451

తిరుపతి

అలరించిన బాలు స్మారక సంగీత కచేరి



తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఎస్పీ బాలసుబ్రమణ్యం జయంతి సందర్భంగా తిరుపతి ఫిలిం సొసైటీ ఆధ్వర్యంలో మహతి కళాక్షేత్రంలో శనివారం సంగీత కచేరి ప్రారంభమైంది. గాయకులు ఉదయ్‌భాస్కర్, సురభి శ్రావణి, స్నిగ్ధ, ప్రవస్థి, రేణుకుమార్, నరసింహ, తదితరులు బాలు పాటలను ఆలపించి ఆకట్టుకున్నారు. అనంతరం తిరుపతి ఫిలిం సొసైటీ ఛైర్మన్ వేణుగోపాలరెడ్డి, అధ్యక్షులు వైఎస్ బాబు సత్కరించారు. . అంకితం నీకే అంకితం కార్యక్రమంలో భాగంగా చేపట్టిన సభలో పారిశ్రామికవేత్త పీసీ రాయలు, టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, తిరుపతి ఫిలిం సొసైటీ ఛైర్మన్ వేణుగోపాలరెడ్డి, అధ్యక్షులు వైఎస్ బాబు, చదలవాడ కవిత, స్నేహ డేకార్స్ అధినేత రాజు, జీఎల్ మనోహర్ తదితరులు మాట్లాడారు. సంగీత సామ్రాజ్యంలో ఎస్‌పి బాలసుబ్రమణ్యం అజరామరుడని కీర్తించారు. కార్యక్రమంలో తిరుపతి ఫిలిం సొసైటీ ఇన్‌చార్జి కార్యదర్శి శాంతావాణి, కోశాధికారి ప్రసాదరావు, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టు మృతి



మృతి చెందిన నరేష్

తిరుపతి(నేరవిభాగం), జూన్ 14(ఆంధ్రజ్యోతి): నాయుడుపేట- పూతలపట్టు జాతీయ రహదారి లోని తాజ్ హోటల్ వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో స్కూటరిస్టు మృతి చెందాడు. వివరాలివి.. తిరుపతి రూరల్ మండలం పద్మావతిపురానికి చెందిన సోడిశెట్టి నరేష్ (42) శుక్రవారం రాత్రి స్కూటర్‌పై తనపల్లికి వెళ్ళాడు. తిరిగి పద్మావతిపురం వస్తుండగా స్థానిక రామానాయుడు కళ్యాణమండపం వద్ద ముందు రోడ్డుపై గుర్తు తెలియని ట్రాక్టర్ ద్విచక్రవాహనాన్ని వేగంగా ఢీకొంది. ఈ ఘటనలో నరేష్‌కు తీవ్ర గాయాలయ్యాయి. స్విమ్స్‌కు తరలించగా చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. మృతుడి సోదదరుడు బాలాజీ ఫిర్యాదు మేరకు సీఐ చిన్నగోవిందు కేసు నమోదు చేశారు. .

అడిగోపుల కవితాసంపుటి ఆవిష్కరణ



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న నగర, సాహిత్య ప్రముఖులు

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అడిగోపుల వెంకటరత్నం రాసిన అక్షరాల మొలకెత్తుతూనే ఉంటాయి కవితా సంపుటి ఆవిష్కరణ కార్యక్రమం జరిగింది. అడిగోపుల వెంకటరత్నం తొలి వర్థంతి సందర్భంగా తిరుపతిలోని వేమన విజ్ఞాన కేంద్రంలో శనివారం ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎస్వీయూ వీసీ అప్పారావు, ద్రవిడ వర్సిటీ మాజీ వీసీ సత్యనారాయణ, ఎస్వీయూ ఓఆర్‌ఐ డైరెక్టర్ వీసీ వేంకటేశ్వర్లు, కవులు కొత్వాలు అమరేంద్ర, మల్లేశ్వరరావు, నిర్వాహకులు మల్లారపు నాగార్జున తదితరులు పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కవిగా అడిగోపుల ఆలోచనలు నేటి సమాజానికి చాలా అవసరమన్నారు. ఈ సందర్భంగా అడిగోపుల పురస్కారాలను రావెల సాంబశివరావు, జి. రమేష్‌బాబుకు అందజేశారు. కార్యక్రమంలో సాకం నాగరాజ, బీరం సుందరరావు, పలువురు సాహిత్యాభిమానులు పాల్గొన్నారు.

మంత్రి అచ్చెన్నాయుడును కలిసిన టీడీపీ నేతలు



అచ్చెన్నాయుడును కలిసిన టీడీపీ నేతలు సుగుణమ్మ, ఆర్సీ మునికృష్ణ తదితరులు

తిరుపతి, జూన్14(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి చిత్తూరు జిల్లా పర్యటన అనంతరం శనివారం సాయంత్రం శ్రీవారి దర్శనం కోసం తిరుమలకు వచ్చిన రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడును తిరుపతి టీడీపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిసి స్వాగతం పలికారు. మంత్రిని కలిసిన వారిలో ఏపీజీబీసీ ఛైర్మన్ సుగుణమ్మ, డిప్యూటీ మేయర్ ఆర్సీ మునికృష్ణ, నాయకులు బుల్లెట్ రమణ, పులుగోరు మురళి, మునిశేఖర్, రాజు యాదవ్, వెంకీ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి

తిరుపతి(ఆటోనగర్)జూన్14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామని కూటమి నాయకులు పసుపులేటి హరిప్రసాద్, జి.నరసింహయాదవ్, ఊకావిజయకుమార్‌లు చెప్పారు. స్థానిక నరసింహతీర్థం రోడ్డులోని ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం కార్యాలయంలో శనివారం సంఘం సమావేశం జరిగింది. ఈ సందర్భంగా నాయకులను విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు కెఆర్ శంకర్, సి.వెంకటేశ్వర్లు శెట్టిలూ సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు మునిక్రిష్ణయ్య,రమణ, టి.సిద్ధయ్య, టి.గోపాల్, పాపయ్య, టి.విజయలక్ష్మి, ఎస్.మెహరున్‌బీ, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

హెచ్చరిక ప్రకటన

ఇందుమూలముగా యావన్మందికి తెలియజేయడం ఏమనగా మా కక్షిదారులు తిరుపతి, శ్రీనివాసపురం డోర్ నెం. 2-79, ఇంటిలో నివాసముండు, నాగమనాయుడు గారి కుమారుడు డి.లీలాకృష్ణమ నాయుడు వయస్సు 76 సం॥లు సీనియర్ సిటిజన్ వారి వద్ద రూ. 2,80,00,000/-లు అక్షరాల రెండు కోట్ల యనభై లక్షల రూపాయలు అసలు వడ్డీతో కలిపి తీసుకుని భాకీపడిన తిరుపతి జిల్లా, వడమాలపేట మండలం, సీతారామపురం గ్రామ వాస్తవ్యులు ప్రస్తుతం బెంగుళూరు జె.పి.నగర్‌లో M/s. అవనీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ రియల్ ఎస్టేట్ వ్యాపారాం చేస్తున్న యం. క్రిష్ణమ నాయుడు గారి కుమారుడు యం. దినకర్ పై కనిన రొక్కం 2,80,00,000/-లను తిరిగి చెల్లించనందున మా కక్షిదారులు తిరుపతి 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టు నందు ఒ.ఎస్.నెం. 31/2023 దావా ఐ.ఎ.నెం. 280/2023 నందు షెడ్యూలు ఆస్తిపై అటాచ్‌మెంట్ 24-04-2023న పొందియున్నారు. సదరు కోర్టుల వారు అటాచ్‌మెంట్ పొందివున్న ఆస్తులు వారి భార్య మారుపూరి సుప్రియ పేరిట, కుమారుడు మారుపూరి ధీరజ్ పేరిట వారు ఇతరల పేరిట మోసపూరితముగా నామ మాత్రపు పత్రాలను సృష్టించి మా కక్షిదారులకు రావలసిన బాకీ రూపాయలను ఎగ్గొట్టాలని అదే గాక సదరు దావాలోని పుత్తూరు, వడమాలపేట, సీతారామపురం గ్రామంలోని ఎ, బి, సి, డి, ఆస్తులను కూడా మోసపూరితమైన ఉద్దేశ్యంతో నామ మాత్రపు పత్రాలను సృష్టించి సదరు మా కక్షిదారులకు రావలసిన అప్పు (బాకీ) ఎగ్గొట్టాలని ప్రయత్నించుచున్నారు. అట్టి ఆస్తులన్నియూ కోర్టు కేసులో ఉన్నందున ప్రజలు / కొనుగోలుదారులు కోర్టు వ్యవహారంలో వున్న ఆస్తులను కొనుగోలుచేసి మోసపోకూడదని, అట్టి నామమాత్రపు పత్రములు చెల్లవని అట్టివారిపై మా కక్షిదారుడు తీసుకొను చట్టపరమైన సివిల్ మరియు క్రిమినల్ చర్యలకు భాద్యులగుదురని హెచ్చరించడమైనది.

షెడ్యూలు : తిరుపతి జిల్లా, శ్రీబాలాజి రి.డి., పుత్తూరు సబ్.డి., వడమాలపేట మండలం, నెం.8, సీతారామాపురం అనే చెంగనగుంట గ్రామ లెక్కధాఖలాలోని భూముల వివరములు

ఎ) ఎ) సర్వేనెం. 243-7లో ఎ.0.24 సెంట్లు, బి) సర్వేనెం. 422-8ఎలో ఎ.0.60 సెంట్లు వెరసి మొత్తం ఎ0.84 సెంట్లు.	డి) 1వ ఐటమ్ సర్వేనెం. 203-1బిలో ఎ.0.71సెంట్లు
బి) సర్వేనెం. 261-1లో ఎ.0.12.5 సెంట్లు.	2వ ఐటమ్ సర్వేనెం. 202-3బిలో ఎ. 0.30 సెంట్లు
సి) సర్వేనెం. 202-1లో ఎ.0.22 సెంట్లు, సర్వేనెం. 202ఎలో ఎ. 1.16 సెంట్లు, సర్వేనెం. 202-3ఎలో ఎ.1.08 సెంట్లు మొత్తం ఎ. 2.46 సెంట్లు	3వ ఐటమ్ సరే నెం. 202-1బిలో ఎ. 0.06 సెంట్లు 4వ ఐటమ్ సర్వేనెం. 202-2బిలో ఎ. 0.22 సెంట్లు వెరసి మొత్తం ఎ. 1.29. సెంట్లు మొత్తం భూమి విస్తీర్ణం : ఎ. 4.71 సెంట్లు
క్లయింట్ **డి. లీలాకృష్ణమ నాయుడు**	**మట్టా పురుషోత్తం రెడ్డి** న్యాయవాది, తిరుపతి.

నోఫ్లయింగ్ జోన్ అమలు చేయాలి

తిరుపతి(జీవకోన), జూన్ 14(ఆంధ్రజ్యోతి): తిరుమల ఆలయంపై విమాన రాకపోకలు లేకుండా చూడాలని శ్రీవారి భక్తుడు నవీన్‌కుమార్‌రెడ్డి కోరారు. ఆలయపైభాగంలో నో ఫ్లయింగ్ జోన్ ఉత్తర్వులకు టీటీడీ బోర్డు సభ్యులతో కూడిన త్రీమెన్ కమిటీని ఏర్పాటు చేసి ఢిల్లీకి పంపాలన్నారు. ఆలయ పవిత్రతను, భద్రతను, భక్తుల మనోభావాలను దృష్టిలో పెట్టుకుని టీటీడీ ధర్మకర్తలమండలి ఛైర్మన్, బోర్డు సభ్యులు కేంద్రప్రభుత్వంతో సత్వరమే చర్చలు జరిపి ఆలయ పైభాగంలో విమాన రాకపోకలను నిషేధించాలన్నారు. తరుపతి విమానాశ్రయంలో ఎయిర్‌పోర్టు డైరెక్టర్‌కు, ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌కు కేంద్ర విమానయాన శాఖ నుంచి ఆలయ పైభాగంలో విమాన రాకపోకలు నిషేధమని అధికారిక ఉత్తర్వులు, ఆదేశాలు రాకపోవడంతో విమానాల రాకపోకలు కొనసాగుతున్నాయన్నారు.

అప్పు చెల్లించమంటే దౌర్జన్యం

తిరుపతి(నేరవిభాగం), జూన్ 14(ఆంధ్రజ్యోతి): తిరుపతికి చెందిన డాట్ ట్రావెల్స్ ఎండీ వెంకట్ కల్యాణ్‌పై ఈస్ట్ పోలీసులు శనివారం కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ గిరిబాబు కథనం మేరకు వెంకట్ కల్యాణ్ హైదరాబాదుకు చెందిన హెచ్‌ఎస్‌బీసీ బ్యాంకులో మేనేజర్ శైలజా రెడ్డితో మెల్లగా సంబంధాలు ఏర్పరుచుకున్నాడు. వీరి మధ్య ఆర్థిక లావాదేవీలు జరుగుతున్నాయి. దీంతో శైలజా రెడ్డి నుంచి దాదాపు రూ 1.20 లక్షలు అప్పు తీసుకున్నాడు. డబ్బులు ఇవ్వాలని అడగడంతో ఆమెపై దౌర్జన్యం చేశాడు. శనివారం శైలజా రెడ్డి ఇచ్చిన పిర్యాదు మేరకు కిరణ్‌పై ఎస్‌ఐ కేసు నమోదు చేశారు.

సర్వేయర్ల సమస్యలను పరిష్కరించాలి

తిరుపతి అర్బన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): విలేజ్ సర్వేయర్ల సమస్యలను వెంటనే పరిష్కరించాలని వీఎస్ఏపీ రాష్ట్ర అధ్యక్షుడు మధుబాబు డిమాండ్ చేశారు. శనివారం స్థానిక బైరాగిపట్టెడలోని గంధమనేని శివయ్య భవనంలో ఏపీ గ్రామ సర్వేయర్ల సంఘం రాష్ట్ర మహాసభ నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా నలుమూలల నుంచి వెయ్యిమంది సర్వేయర్లు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా మధుబాబు మాట్లాడుతూ గ్రామసర్వేయర్ల టెక్నికల్ విధులకు తగిన పేస్కేల్ అమలు చేయాలన్నారు. గ్రామ వార్డు సచివాలయం, సర్వే అండ్ భూపరిపాలనశాఖ పలుమార్లు సీనియారిటీ లిస్టు విషయంలో ఉత్తర్వులు ఇచ్చినా కొన్ని జిల్లాలలో అమలుకాలేదన్నారు. అర్హులైన సిబ్బందికి త్వరితగతిన పదోన్నతి కల్పించే చర్యలు తీసుకోవాలని కోరారు. మిగులు 4,722మంది సిబ్బందిని సర్వే సంబంధితశాఖలలో శాశ్వత ప్రాతిపదికన నియమించాలని విజ్ఞప్తి చేశారు.కార్యక్రమంలో సంఘం కార్యదర్శి పి.సాయికిరణ్, కార్యవర్గ సభ్యులు, అన్ని జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు, సభ్యులు, అన్ని జిల్లాల నుంచి గ్రామ సర్వేయర్లు పాల్గొన్నారు.



మురళీనాయక్ కుటుంబానికి ఆర్థిక సాయమందిస్తున్న ఎమ్మెల్యే

మురళీనాయక్ కుటుంబానికి ఆర్థికసాయం

తిరుపతి అర్బన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ సింధూర్‌లో వీరమరణం పొందిన జవాన్ మురళీనాయక్ తల్లిదండ్రులకు ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ప్రకటించిన ఆర్థిక సాయం రూ. 25 లక్షలను ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు అందించారు. శనివారం ఆయన మురళీనాయక్ స్వగ్రామం అనంతపురంజిల్లా కల్లితండాకు వెళ్లి నాయక్ తల్లిదండ్రులను పరామర్శించారు. అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికే రూ.50లక్షలు ప్రకటించిందన్నారు. 5ఎకరాల వ్యవసాయభూమి,ఇంటిజాగా త్వరలోనే అందిస్తామన్నారు. తమ తాండాలో వాలీబాల్ కోర్టు ఏర్పాటు చేయాలని, మురళీనాయక్ తాండాగా పేరు మార్చాలని, రోడ్లు నిర్మించాలని తల్లిదండ్రులు ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో మాజీ మంత్రి పల్లె రఘునాధరెడ్డి, జనసేన నగరాధ్యక్షుడు రాజారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో 34 మంది రక్తదానం

తిరుమల,జూన్14(ఆంధ్రజ్యోతి): ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా శనివారం తిరుమలలోని అశ్విని ఆస్పత్రిలో 34మంది భక్తులు,స్థానికులు రక్తదానం చేశారు. అశ్విని ఆస్పత్రి సివిల్ సర్జన్ డాక్టర్ కుసుమ కుమారి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.డిప్యూటీ సివిల్ సర్జన్ డాక్టర్ సుబ్బారెడ్డి, బ్లడ్‌బ్యాంక్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శోభారాణి పాల్గొన్నారు. **తిరుపతి అర్బన్:** యువజన సర్వీసులశాఖ, ఎన్‌సీసీ మహిళా విభాగం, మెటర్నటి హాస్పిటల్ సంయుక్తంగా రక్తదాన శిబిరం నిర్వహించారు. 25 మంది ఎన్‌సీసీ విద్యార్థులు రక్తదానం చేశారు.

'తోతాపురి'కి మద్దతు ధర ఇవ్వాల్సిందే

మంత్రి అచ్చెన్నాయుడు



మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే నాని, కలెక్టర్ వెంకటేశ్వర్‌ను తోతాపురి మామిడి మాలతో సత్కరిస్తున్న రైతులు

పాకాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో తోతాపురి టన్నుకు ప్రభుత్వం రూ.4వేలు చెల్లిస్తోందని, గుజ్జు పరిశ్రమలు, వ్యాపారులు రూ.8వేలు ఇవ్వాలని నిర్ణయించామని, దీన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు. మండలంలోని దామలచెరువు మ్యాంగోనగర్‌లో శనివారం మామిడి రైతులు, వ్యాపారులతో ఆయన సమావేశమయ్యారు. సాకులు చెప్పడం మానేసి తోతాపురి కొనుగోలు చేసి గుజ్జు పరిశ్రమలు ప్రాసెసింగ్ ప్రారంభించాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లభించడానికి పొగాకుకు రూ.350 కోట్లు, కోకోకు రూ.12కోట్లు, తోతాపురి మామిడికి రూ.167 కోట్లు ప్రభుత్వం కేటాయించిందని వెల్లడించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు డిమాండ్ ఉన్న టేబుల్ రకాలు పండించడానికి ముందుకు రావాలన్నారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ పల్ప్ 60-65శాతం ఎగుమతులపైనే ఆధారపడినందున సమస్యలు తలెత్తాయన్నారు. దేశీయంగా వినియోగం పెరిగేలా టీటీడీ అన్నదానంలో, అంగన్‌వాడీ, పాఠశాలల్లో మ్యాంగో జ్యూస్ ఇవ్వగలిగితే కొంత వరకు సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ముగ్గురు గుజ్జు పరిశ్రమల యజమానులు సిండికేటయిన కారణంగా తోతాపురికి గిట్టుబాటు ధర రావడం లేదని, ఇలాంటి వారి పై చర్యలు తీసుకోవాలని కోరారు. చిత్తూరు ఎమ్మెల్యే జగన్‌మోహన్ మాట్లాడుతూ గుజ్జు పరిశ్రమల మనుగడ కోసం రైతులను కాపాడుకోవాలన్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ మాట్లాడుతూ జిల్లాలో మామిడి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేసి రైతులకు తగిన సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ మాట్లాడుతూ ఈ ఏడాది తోతాపురి దిగుబడి పెరగడం, గత ఏడాది పల్ప్ ఫ్యాక్టరీలలో స్టాకు ఉండడంతో ఈపరిస్థితి తలెత్తిందన్నారు. ఈ సమావేశంలో ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాస్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి, ఆర్డీవో రామ్మోహన్, వివిధ శాఖల అధికారులు మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

తిరుపతిపై రైల్వేల చిన్నచూపు

జీఎం సార్.. వింటారా ఈ గోడు - నేడు దక్షిణకోస్తా రైల్వే జీఎం సందీప్ మాథూర్ రాక

తిరుపతి (సెంట్రల్) జూన్14(ఆంధ్రజ్యోతి): దక్షిణమధ్యరైల్వేలో భాగంగా ఉన్న తిరుపతి జిల్లా తీవ్ర వివక్షకూ, నిరాదరణకూ గురవుతోందనే బాధ ఈ ప్రాంత ప్రజల్లో ఉంది. ప్రపంచ ప్రసిద్ధ హిందూ క్షేత్రం ఉన్న తిరుపతికి దేశం నలుమూలల నుంచీ ప్రయాణికుల రాకపోకలు ఉంటాయి. ఆదాయమూ ఉంటుంది. అయినా అభివృద్ధి వాటాలో మాత్రం ఈ ప్రాంతం అలక్ష్యానికి గురవుతోంది. తిరుపతి రైల్వేస్టేషన్, రేణిగుంట జంక్షన్లకు సంబంధించిన ప్రతిపాదనలు ఏళ్ల తరబడి అతీగతీ లేకుండా మగ్గుతున్నాయి. ఆదివారం జిల్లాకు వస్తున్న దక్షిణ కోస్ట్ రైల్వే కొత్త జనరల్ మేనేజర్ సందీప్ మాథూర్ మీద ప్రజలు కోటి ఆశలతో ఉన్నారు. అధికారులతో ఆయన సమీక్షించి తగిన చర్యలుతీసుకుంటారనే నమ్మకంతో ఉన్నారు. జిల్లా ప్రజలు అనేక ఏళ్లగా కోరుతున్నవి ఇవీ..

రేణిగుంట స్టేషన్‌లో రైళ్లకి చోటులేదు: రేణిగుంట రైల్వేస్టేషన్ రోడ్డు నంబరు ఒకటి(ప్లాట్ ఫారం ఒకటి) నుంచి గూడూరు వైపు వెళ్లే రైలు మార్గాన్ని కలుపుతూ చేపట్టాల్సిన రైలు మార్గం అనుసంధానం పనులు 20 ఏళ్లుగా జరుగుతూనే ఉన్నాయి. ఈ పనులకోసం నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకొనే స్థాయికి వెళ్లింది.రేణిగుంట రైల్వే జంక్షన్‌లో మరో టెర్మినల్ చేయాలి. ప్లాట్ ఫారాలు ఖాళీ లేక రాత్రి సమయాల్లో పొలిమేర్లలో ఎక్స్‌ప్రెస్ రైళ్ళు గంటల తరబడి వేచివుండవలసి వస్తోంది. ఇది రైళ్లలో చోరీలు చేసే ముఠాలకు అనువుగా మారింది. రేణిగుంటసంత వద్ద గేటు నెంబరు (112) స్థానంలో అండర్ బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉంది.

- భారత రైల్వేలో ఏగ్రేడ్-1 రైల్వేస్టేషన్లలో ఒకటైన తిరుపతిలో బాలాజీ డివిజన్ ఏర్పాటు కలగానే మిగిలింది.
- తిరుపతిలోనూ రైల్వేస్టేషన్‌లో నిర్మాణ పనులు సాగుతూనే ఉన్నాయి. వేలాది మంది ప్రయాణించే ఈ స్టేషన్‌లో ప్రజలు ముప్పుతిప్పలు పడుతున్నారు.
- తిరుచానూరు రైల్వేస్టేషన్ నిర్మాణాలు నత్తలతో పోటీ పడుతున్నాయి. దీనిని ప్రయాణికులకు ఎప్పుడు అందుబాటులోకి తెస్తారో తెలియదు.
- తిరుపతి పడమటి రైల్వేస్టేషన్‌వద్ద రేల్ కళ్యాణ్ మండపం నిర్మాణాలు కూడా ఎంతకీ పూర్తికావడం లేదు.
- పుణ్యక్షేత్రాల మధ్య మెము ప్యాసింజర్ రైళ్ళు నడపాలి.
- తిరుపతి-రేణిగుంటల మధ్య మూడవ రైలు మార్గం ఏర్పాటు చేయాలి.
- చంద్రగిరి రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలి.
- సీఆర్ఎస్ సామర్థ్యం పెంచాలి.
- తిరుపతి వెస్ట్ రైల్వేస్టేషన్ అభివృద్ధి చేయాలి. ప్యాసింజర్ రైళ్ళను అక్కడ నుంచే నడిపేవిధంగా అభివృద్ధి పనులు చేపట్టాలి.
- పాకాల రైల్వే జంక్షన్‌రు తగిన ప్రాధాన్యత కల్పించి అభివృద్ధి పనులు చేపట్టాలి.

రైల్వే జీఎం పర్యటన ఇలా



విశాఖపట్టణంలో నూతనంగా రైల్వేజోన్ ఏర్పాటు చేసిన అనంతరం దక్షిణ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజరుగా బాధ్యతలు తీసుకున్న సందీప్ మాథూర్ విశాఖపట్టణం నుంచి ఆదివారం రాత్రి రేణిగుంటకు చేరుకుంటారు. సోమవారం ఉదయం తిరుమలకు వెళ్ళి శ్రీవారిని దర్శించుకుంటారు. తర్వాత తిరుపతికి చేరుకొని రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తారు.

పూడి-ఏర్పేడు మధ్య కొత్త రైలు మార్గం



దక్షిణ మధ్య రైల్వే, దక్షిణ రైల్వేల మధ్య వున్న పూడి-ఏర్పేడు రైల్వేస్టేషన్ల మధ్య నూతన రైలు మార్గం ఏర్పాటు చేయడానికి రైల్వే బోర్డు రూ490.97 కోట్లు నిధులు మంజూరు చేసింది. రెండు స్టేషన్ల మధ్య 25.4 కిలో మీటర్లు రైలు మార్గం వేస్తారు. నాలుగేళ్లలో దీనిని పూర్తి చేస్తారు. దక్షిణ భారత దేశం నుంచి ఉత్తర భారత దేశంలోని ప్రధాన నగరాలకు తక్కువ సమయంలో వస్తురవాణా చేయడానికి రైల్వే బోర్డు ఈ నూతన రైలు మార్గాన్ని ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకుంది. దీంతో పూడి రైల్వే స్టేషన్ కూడా జంక్షన్ కానుంది. ఈ మార్గంలో చెల్లూరు సమీపంలో ఒక రైల్వేస్టేషన్ కూడా వస్తుంది. ఈ రైలు మార్గం పూర్తి చేస్తే రేణిగుంట రైల్వే జంక్షన్‌లో రైళ్ళ రాకపోకల ఒత్తిడి తగ్గుతుంది. ఈ ప్రాంతం నుంచి రైతులు పండించే ఉత్పత్తులు దూరప్రాంతాలకు రవాణా చేసే అవకాశాలు పెరుగుతాయి. రేణిగుంట,ఏర్పేడు మండలాల్లో వున్న భారీ పరిశ్రమల ఉత్పత్తులు కూడా రవాణా చేయడానికి అనుకూలంగా వుంటుంది.

దామినేడులోనాగాలమ్మ పుట్ట కూల్చివేత

ఆగ్రహించిన గ్రామస్థులు ● ఘర్షణ.. ఉద్రిక్తత.. పోలీస్ పికెట్ ఏర్పాటు





నాగాలమ్మ ఆలయం ఫైల్ ఫొటో - పోలీసుల ఎదుటే కొట్టుకుంటున్న ఇరువర్గాలు

తిరుచానూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): తిరుపతి రూరల్ మండలం దామినేడు లో నాగాలమ్మ ఆలయంగా గ్రామస్తులు కొలిచే పుట్టను నేలమట్టం చేయడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఘర్షణకు దారి తీసింది. ఇక్కడ 15 ఎకరాల వరకు ఇనాం భూములను రైతులు సాగు చేసుకునేవారు. కొంతకాలం కిందట వేలుమురగన్ బోర్‌వెల్స్‌కు చెందిన కృష్ణమూర్తి నాయుడు ఈ భూములను తాను కొనుగోలు చేశానని చెప్పి, కంచె వేశారు. దీనిపై గ్రామస్థులకు, కృష్ణమూర్తి నాయుడుకు కోర్టులో వివాదం నడుస్తోంది. ఇదే సర్వే నెంబరులోనే నాగాలమ్మ పుట్ట ఉంది. గ్రామస్థులు నాగాలమ్మకు పూజలు చేసేవారు. శనివారం వేకువజామున నాగాలమ్మ ప్రహరీగోడను జేసీబీలతో కృష్ణమూర్తినాయుడుకు చెందిన వారు నేలమట్టం చేశారు. పుట్టను కూడా తొలగించారు. దేవతలుగా భావించే రాళ్లనూ తొలగించారని తెలియడంతో గ్రామస్థులు పెద్దసంఖ్యలో ఆలయం వద్దకు చేరకుని కృష్ణమూర్తినాయుడును నిలదీశారు. వాగ్వాదం పెరిగి ఘర్షణకు దారితీసింది. గ్రామస్థులు కృష్ణమూర్తి, అతని అనుచరులపై దాడి చేసి కొట్టారు. వీరి అనుచరులు గ్రామస్తులనూ కొట్టారు. అతికష్టమీద పోలీసులు కృష్ణమూర్తి నాయుడు, అతనికుమారుడిని తిరుచానూరు పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. తర్వాత కూల్చివేసిన స్థలంలోనే ఆలయ ప్రహరీ గోడను నిర్మించేందుకు గ్రామస్థులు సిద్ధమయ్యారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో చంద్రగిరి డీఎస్పీ ప్రసాద్, ఇన్‌ఛార్జి సీఐ ఇమ్రాన్‌బాషా పెద్దసంఖ్యలో పోలీసులతో అక్కడికి చేరుకున్నారు. ఆలయ నిర్మాణ పనులను అడ్డుకున్నారు. మా ఆలయం తిరిగి కట్టించే వరకు ఇక్కడి నుంచి కదిలేది లేదని గ్రామస్థులు కూడా అక్కడే బైఠాయించారు. విషయం తెలుసుకున్న భజరంగ్‌దళ్, పలు హిందు సంఘాలు వారికి మద్దతుగా నిలిచాయి. వైసీపీ చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి శనివారం సాయంత్రం అక్కడికి చేరుకుని గ్రామస్తులకు సంఘీభావం తెలిపారు. కాగా నాగాలమ్మ పుట్ట ఉన్న భూమి తనేదనని కృష్ణమూర్తినాయుడు తెలిపారు. కష్ణమూర్తినాయుడు,అతని కుమారుడు పద్మాకర్, అతని అనుచరులపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ సాయినాథ్ చౌదరి తెలిపారు.

వైసీపీ మిగిల్చిన చెత్తను, రుణాన్ని క్లియర్ చేస్తున్నాం

● పురపాలక మంత్రి నారాయణ



డంపింగ్‌యార్డు వద్ద సూచనలిస్తున్న మంత్రి నారాయణ

తిరుపతి, జూన్14(ఆంధ్రజ్యోతి) : గత వైసీపీ ప్రభుత్వం 85 లక్షల టన్నుల చెత్తను, రూ.10 లక్షల కోట్ల అప్పును వదిలేసి వెళ్లిందని, దార్శనికత ఉన్న సీఎం చంద్రబాబు ఈ చెత్తను, అటు రుణాన్ని క్లియర్ చేసే బాధ్యత తీసుకున్నారని రాష్ట్ర పురపాలక శాఖ డాక్టర్ నారాయణ అన్నారు. శుక్రవారం ఆయన రామాపురం డంపింగ్ యార్డ్‌ను ఏపీజీబీసీ చైర్మన్ సుగుణమ్మ, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, మున్సిపల్ అధికారులు తదితరులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటివరకు 45 లక్షల టన్నుల చెత్తను క్లియర్ చేశామన్నారు. రాబోయే మూడు నెలలలో 35 లక్షల టన్నుల చెత్తను క్లియర్ చేయడానికి వేగవంతంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. తిరుపతి జిల్లాలో జిగ్మా కంపెనీ రోజుకు 900 టన్నుల చెత్తను క్లియర్ చేస్తున్నారన్నారు. ఈక్రమంలోనే పరిశీలించేందుకు వచ్చామన్నారు. ఆర్థికంగా రాష్ట్రం ఎంత కష్టంలో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీల అమలుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రభుత్వం అమల చేస్తున్న సంక్షేమ పథకాల గురించి ఆయన వివరించారు. కార్యక్రమంలో నగర పాలక సంస్థ డీసీ అమరయ్య, ఎంఈ గోమతిలు పాల్గొన్నారు.

హెల్త్ వర్సిటీ ఈసీగా డాక్టర్ మాధవి



తిరుపతి (వైద్యం), జూన్ 14(ఆంధ్రజ్యోతి): డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఎగ్జిక్యూటివ్ కౌన్సిల్‌గా ప్రభుత్వ ప్రసూతి ఆస్పత్రి ప్రొఫెసర్ డాక్టర్ కె.మాధవిని నియమిస్తూ ప్రభుత్వం శనివారం ఉత్తర్వులు జారీ చేసింది. ఈమె ఎస్వీ వైద్య కళాశాలలో 24 ఎండీ సీట్లను 41కి పెంచేందుకు కృషి చేశారు. ఓ మహిళ కడుపులోని 34 కేజీల గడ్డను శస్త్ర చికిత్స చేసి విజయవంతంగా తొలగించారు. సేవలకు గుర్తింపుగా ప్రభుత్వం డాక్టర్ ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీ ఈసీగా అవకాశం కల్పించింది.

వేరుశనగ విత్తనాల పంపిణీ



వేరుశనగ విత్తనాలు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యేలు నాని, మురళి

పాకాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఉప్పరపల్లె పంచాయతీ ఆనందగిరి ఆలయ ఆవరణలో శనివారం ఎమ్మెల్యే పులివర్తి నాని, పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్‌ల చేతులమీదుగా రైతులకు వేరుశనగ విత్తనాలు పంపిణీ చేశారు. వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించి సేంద్రీయ పద్ధతులతో సాగుచేసి తక్కువ వ్యయంతో నాణ్యమైన అధిక దిగుబడి సాధించాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ నంగా పద్మజరెడ్డి, మండల టీడీపీ కన్వీనర్ బి.నాగరాజనాయుడు, ఏఎంసీ చైర్మెన్ కె.సుధాకరయ్య, ఆనందగిరి ఆలయ కమిటీ చైర్మెన్ చంద్రశేఖర్ నాయుడు, ఏవో హరితకుమారి, టీడీపీ నాయకులు కె.సావిత్రి, బి.ఈశ్వరచౌదరి, బాలాజీ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

శాప్ చైర్మన్‌ను కలిసిన రజని

తిరుపతి(క్రీడలు), జూన్ 14(ఆంధ్రజ్యోతి): శాప్ డైరెక్టర్‌గా నియమితులైన హాకీ క్రీడాకారిణి రజని శనివారం శాప్ చైర్మన్ రవినాయుడుని కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు హాకి స్టిక్‌ను బహుమతిగా అందజేశారు. అనంతరం ఆయన ఆమెకు శాలువకప్పి ఘచారు. మరో డైరెక్టర బొమ్మినేని శివ(అనంతపురం)కూడా రవినాయుడుని కలసి కృతజ్ఞతులు తెలియజేశారు. అలాగే తిరుపతికి చెందిన బాక్సింగ్ క్రీడాకారుడు వై.ముకేష్‌సాయిని శాప్ చైర్మన్ రవినాయుడుని శనివారం కలిశారు.

నీట్‌లో శ్రీధర్స్ అకాడమీ ప్రతిభ



శ్రీధర్స్ అకాడమీ విద్యార్థులు ఐశ్వర్య, చైతన్య, చరణి, హాసిని, మోహిష్, సాయిపార్థు

తిరుపతి(విద్య), జూన్ 14(ఆంధ్రజ్యోతి): నీట్‌లో తిరుపతి ఏఐఆర్ బైపాస్ రోడ్డులోని శ్రీధర్స్ అకాడమీ విద్యార్థులు జాతీయ స్థాయి నీట్ పరీక్షలో అత్యుత్తమ మార్కులు సాధించి ప్రతిభ చాటారని విద్యాసంస్థ చైర్మన్ మద్దినేని శ్రీధర్ తెలిపారు. తమ విద్యార్థులు చైతన్యరెడ్డి 578 మార్కులు, ఐశ్వర్య 550, మోహిష్ 540, దుర్గ 535, చరనిసాయి 530, వైష్ణవి 520, సాయిపార్థు 510, హాసిని 502 మార్కులు సాధించారని, అలాగే 10 మంది విద్యార్థులు 500 మార్కులకు పైబడి సాధించారని వెల్లడించారు. ప్రతిభ చూపిన విద్యార్థులను చైర్మన్ శ్రీధర్‌తోపాటు అధ్యాపక బృందం అభినందించారు.

విమాన ప్రమాద మృతులకు పురోహితుల నివాళి

తిరుపతి (విశ్వవిద్యాలయాలు), జూన్ 14 (ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్ విమాన ప్రమాద ఘటనలో మృతి చెందిన వారికి తిరుపతి పురోహితులు ఘన నివాళులర్పించారు. కపిలతీర్థం పురోహిత సంఘం ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం కపిల తీర్థం నంది కూడలిలో వీరు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. మృతుల ఆత్మకు శాంతి కలగాలని మంత్రోచ్ఛరణ చేశారు. అనంతరం సంఘం అధ్యక్షులు కృష్ణమూర్తిశాస్త్రి మాట్లాడుతూ..వందలాది మంది ప్రాణాలు కోల్పోవడం దేశ ప్రజానీకాన్ని ఆవేదనకు గురి చేసిందన్నారు. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వేదం హరి, కృష్ణశర్మ, మహేష్, నాగరాజు, నటరాజశర్మ, సుధీర్‌శర్మ, మురళిశర్మ, సుబ్బుస్వామి, మోహనశర్మ, కొత్తపల్లె అజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

డైజిన్ సిరప్ అడిగితే చర్మవ్యాధి లోషన్ ఇచ్చారు

తిరుమల, జూన్14(ఆంధ్రజ్యోతి): జీర్ణం కావడం లేదని డైజిన్ సిరప్ ఇవ్వమని అడిగిన వీరరాఘవ అనే షికారీకి తిరుమలలోని మెడికల్ షాప్‌లో చర్మవ్యాధికి వినియోగించే లోషన్ ఇచ్చాడు. శరీరానికి వెలుపల వాడాల్సిన లోషన్‌ను తాగడంతో ఆ షికారీకి వాంతులు పట్టుకున్నాయి. గురువారం ఈ సంఘటన జరిగింది. ఆందోళనతో వీరరాఘవ అశ్విని ఆస్పత్రికి వెళ్లగా వైద్యులు విషయాన్ని గుర్తించి టీటీడీ రెవిన్యూ అధికారులకు ఫిర్యాదు చేశారు. దీంతో రెవిన్యూ అధికారులు తిరుమలలోని మెడికల్ షాపులపై శుక్ర,శనివారాల్లో దాడులు నిర్వహించారు. ఆరు దుకాణాలకు లైసెన్సులు కూడా లేవని గుర్తించారు. వాటిని మూసేశారు. చాలా షాపుల్లో బీఫార్మసీ, డీఫార్మసీ చదివివారు కాదు కదా కనీసం డిగ్రీ చదివిన వారు కూడా లేరు. వీరు భక్తులకు తమకు తోచిన మందులు ఇస్తూ ప్రాణాలతో చెలగాటమాడుతున్నారని గ్రహించారు. తనిఖీలు పూర్తయ్యాక టీటీడీకి నివేదిక ఇస్తామని రెవిన్యూ అధికారులు తెలిపారు. చర్మవ్యాధి మందు తాగిన వీరరాఘవ ఆరోగ్య పరిస్థితి కుదుటపడుతోందని వైద్యులు తెలిపారు.

యోగాతో సంపూర్ణ ఆరోగ్యం



యోగాసనాలు వేస్తున్న కలెక్టర్, జేసీ

తిరుపతి(క్రీడలు),జూన్14(ఆంధ్రజ్యోతి): యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని కలెక్టర్ వెంకటేశ్వర్ అన్నారు. స్థానిక ఇందిరా మైదానంలోని ఇండోర్ మల్టీపర్పస్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శనివారం ఉదయం యోగాసనాలు వేశారు. జేసీ శుభం బన్సల్, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, డిప్యూటీ మేయర్లు ముద్రనారాయణ, ఆర్సీ మునికృష్ణ, క్రీడాకారులు, ఇతర ప్రముఖులు పాల్గొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ త్వరలో 5వేల మందితో తిరుపతి, శ్రీకాళహస్తి, పులికాట్ సరస్సు, శ్రీహరికోటలో నిర్వహిస్తామని తెలిపారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ చరణ్‌తేజ్‌రెడ్డి, డిప్యూటీ కమిషనర్ అమరయ్య, తహసీల్దార్ భాగ్యలక్ష్మి పాల్గొన్నారు.

రాణించిన అశ్వమేథ విద్యార్థులు



అశ్వమేథ విద్యార్థులతో డైరెక్టర్లు, అధ్యాపక సిబ్బంది

స్థానిక ఎం.ఆర్. పల్లిలోని అశ్వమేథ జూనియర్ కళాశాల విద్యార్థులు నీట్‌లో మంచి మార్కులు సాధించి రాణించారని విద్యాసంస్థ డైరెక్టర్లు అబ్దుల్ ఇష్రత్, టీఎం గోవర్ధన్ తెలిపారు. తమ విద్యార్థులు అభిరామ్ 591, అభిషేక్ 560, హరీశ్వర్ 535, మధురి 522, ముఖేష్‌రెడ్డి 518. స్వప్న 509, రోషన్ 507 మార్కులు సాధించారని, అలాగే 102 మంది విద్యార్థులకుగాను 23 మంది ఎంబీబీఎస్ సీట్లు సాధించగలిగే ర్యాంకులు పొందారని చెప్పారు. విద్యార్థులను ప్రిన్సిపల్స్ సుమతి, రామయ్య, అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది అభినందించారు.

శ్రీచైతన్య విద్యార్థుల విజయభేరి



శ్రీచైతన్య విద్యార్థులను అభినందిస్తున్న ఏజీఎం బీవీ ప్రసాద్, కేఎల్‌జీ ప్రసాద్ తదితరులు

నీట్ ఫలితాల్లో శ్రీచైతన్య విద్యార్థులు ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు కైవసం చేసుకున్నారని, తిరుపతి జోన్ నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు మెడిసిన్ ర్యాంకు సాధించారని ఏజీఎం బీవీ ప్రసాద్, డీన్‌లు తెలిపారు. ఆరుష్ లక్ష్మణ్ 337వ ర్యాంకు, యశ్వంత్ 1042, దేవేంద్ర 1365, హరిత 2121, హరిత 2277, టీనారాణి 2368, గుణ భూషణ్ 2460, దీక్షిత 2695, మహతి 3723, శివకృతిక్ 4126, హర్షిత 4259, కల్పన 4824 వంటి టాప్ ర్యాంకులు సాధించినట్టు చెప్పారు. జాతీయ స్థాయిలో 10 వేలలోపు 28 మంది, 20వేలలోపు 46 మంది, వివిధ కేటగిరీల నుంచి 120 మంది విద్యార్థులు ఎంబీబీఎస్ సీట్లు సాధించగలిగే ర్యాంకులు సాధించినట్టు వివరించారు. విద్యార్థులను, అధ్యాపకులను అభినందించారు. డీన్‌లు కేఎల్‌జీ ప్రసాద్, రామమోహన్‌రావు, ప్రిన్సిపాళ్లు, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

నారాయణ విద్యార్థుల హవా



నారాయణ విద్యార్థులతో డీజీఎం కొండలరావు, తదితరులు

నీట్ పరీక్షలో తిరుపతి నారాయణ విద్యాసంస్థల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించారని డీజీఎం కొండలరావు తెలిపారు. విశ్వక్ అగర్వాల్ జాతీయ స్థాయిలో 114వ ర్యాంకు, చప్పిడి జ్ఞానీషా రెడ్డి 582, లోకేశ్వరి 1253, మౌనిక 1393, రామ్‌చరణ్ రెడ్డి 1508, కీర్తి 3831, బాలాజీ 4279, ధృతిప్రియ 4597, వంటి టాప్ ర్యాంకులతోపాటు సుమారు 50 మందికి పైగా తమ విద్యార్థులు మెడికల్ సీట్లు సాధించబోతున్నారని చెప్పారు వీరిని కోర్ డీన్ శ్రీనివాసరావు, డీన్ వేణుగోపాల్, ప్రిన్సిపాళ్లు మణికంఠ, సుధాకర్‌నాయుడు, ఏజీఎం చెన్నకేశవరావు, అధ్యాపకులు అభినందించారు.

డాక్టర్స్ మెడికల్ అకాడమీ విద్యార్థుల విజయం



డాక్టర్స్ మెడికల్ అకాడమీ విద్యార్థులు

నీట్ పరీక్షలో తిరుపతి డాక్టర్స్ మెడికల్ అకాడమీ విద్యార్థులు 60 మంది అత్యుత్తమ మార్కులతో విజయం సాధించారని కళాశాల చైర్మన్ బీవీ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ పార్థివ్‌రెడ్డి తెలిపారు. తన్మయి 80వ ర్యాంకు, గణేషబాబు 232, వెంకటవరప్రసాద్ దోహిత్ 371, ఈష్టర్ రాణి 1147, హర్షవర్ధన్ రెడ్డి 1874, గణేష్ నాయక్ 3231, సాయి శ్రీరావు 4774 సాధించారని వెల్లడించారు. 10వేలలోపు 15 మంది విద్యార్థులు, 15వేలలోపు 27 మంది, 20వేలలోపు 38 మంది కలుపుకొని 60 మందికిపైగా వివిధ కేటగిరీల్లో సీట్లు సాధిస్తారని వివరించారు.

తెలుగుగంగ ఉప కాలువలు నిర్మించండి

తెలుగుగంగ సీఈకు ఎమ్మెల్యే ఆదిమూలం వినతి

సత్యవేడు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): తెలుగుగంగ పరివాహక ప్రాంతాల్లో వ్యవసాయానికి అవసరమైన మేరకు ఉప కాలువలుబ నిర్మించాలని తెలుగు గంగ చీఫ్ ఇంజనీర్ వరప్రసాద్‌కు ఎమ్మెల్యే ఆదిమూలం విన్నవించారు. మండలంలోని ఆంధ్ర - తమిళనాడు రాష్ట్రాల సరిహద్దులోని తొండుకుళి వద్ద జీరో పాయింట్‌ను తెలుగుగంగ సీఈ, ఈఈ తదితర ఉన్నతాధికారులతో కలిసి ఎమ్మెల్యే శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... గంగ కాలువలు ఏర్పాటు చేసి మూడు దశాబ్దాలవుతున్నా ఇంత వరకు రైతాంగానికి పూర్తిస్థాయిలో సాగునీరు అందించలేకపోతున్నామన్నారు. ఉపకాలువలు నిర్మించి రైతులను ఆదుకోవాలని కోరారు. అదేవిధంగా వరదయ్యపాళెం మండలం సీఎల్ఎన్‌పల్లె వద్ద గంగ కాలువకు లాక్ ఏర్పాటు చేస్తే పది గ్రామాలకు సాగు నీరు అందించవచ్చని సీఈ వరప్రసాద్‌కు తెలిపారు. ఈఈ రత్నాకర్‌రెడ్డి, తమిళనాడు డీఈ మహేంద్రన్, ఏఈ వెంకటేశులు, నాయకులు పరమశివం, యుగంధర్ రెడ్డి, శ్రీనివాస్‌యాదవ్, లోకయ్యరెడ్డి, శశిమోహన్, ప్రభాకర్‌రెడ్డి, సెల్వకుమార్, శివానందం, మునిక్రిష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీలపై తేనెటీగల దాడి



చికిత్స పొందుతున్న గోపి, సుజాత

సత్యవేడు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ఉపాధి కూలీలపై తేనెటీగలు దాడి చేశాయి. ఈ సంఘటన సత్యవేడు మండలం మదనం బేడులో జరిగింది. గ్రామానికి చెందిన పలువురు కూలీలు శనివారం ఉదయం అటవీ సమీపంలోని ప్రాంతంలో ఉపాధి పనులకు వెళ్ళారు. ఈ క్రమంలో పనులు చేసుకుంటున్న కూలీలపై ఒక్కసారిగా తేనెటీగలు దాడి చేశాయి. కూలీలు భయపడి పరుగులు తీశారు. తేనెటీగల దాడిలో ఆరుగురు కూలీలకు గాయాలయ్యాయి. గాయపడిన కూలీలను గ్రామస్తులు సత్యవేడు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరిలో గ్రామానికి చెందిన గోపి, సుజాత దంపతులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరి పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన చికిత్స కోసం చెన్నై జీహెచ్‌కు తరలించారు.

ప్రయాణికురాలి బ్యాగు నుంచి రూ.లక్ష చోరీ

సత్యవేడు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నాగలాపురం ఆర్టీసీ బస్టాండ్ వద్ద ప్రయాణికురాలి బ్యాగులోని నగదును గుర్తు తెలియని వ్యక్తులు అపహరించుకు వెళ్లారు. ఈ సంఘటన శనివారం జరిగింది. బాధితురాలు తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని కడివేడు గ్రామానికి చెందిన సుకన్య తిరుపతిలో చదువుతున్న తన పిల్లల స్కూల్ ఫీజులు కట్టేందుకు తన తల్లితో కలిసి నాగలాపురం బస్టాండుకు చేరుకుంది. తిరుపతికి వెళ్లేందుకు సత్యవేడు డిపో బస్సు ఎక్కింది. టికెట్ తీసుకునేందుకు బ్యాగును చూడగా జిప్ తెరిచి ఉండడాన్ని గమనించింది. అందులో హ్యాండ్ బ్యాగ్‌లో రూ.లక్ష నగదు మాయమైనట్లు గుర్తించి బస్సు దిగి బస్టాండ్ పరిసర ప్రాంతాల్లో విచారించింది. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఎస్ఐ సునీల్ బస్టాండ్‌కు చేరుకుని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు. కాగా అదే బస్టాండ్ ప్రాంతంలో వారం క్రితం బీరకుప్పానికి చెందిన ఓ రైతు ధాన్యం అమ్మిన డబ్బులు తన నిక్కర్‌లోని జేబులో పెట్టుకుని ఉండగా కత్తిరించి రూ.రెండు లక్షలు అపహరించుకెళ్లారు. వరుస చోరీలతో ప్రయాణికులు బెంబేలెత్తుతున్నారు.

నైపుణ్యాలతో జీవితం నిర్మించుకుందాం



శిక్షణలో పాల్గొన్న విద్యార్థులతో నిర్వాహకులు

ఏర్పేడు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పనిలో నాణ్యత కోసం ప్రతి ఒక్కరూ పంచసూత్రాలను పాటించాలని ప్రముఖ సైకాలజిస్టు డాక్టర్ ఎన్.బి. సుధాకర్‌రెడ్డి సూచించారు. ఏర్పేడు సమీపంలోని ఎస్‌వోఎస్ బాలల గ్రామంలో విద్యార్థులకు నిర్వహించిన నైపుణ్య శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... జ్ఞానం, వికాసం, సామర్థ్యం, చురుకుదనం, నైపుణ్యం ఉన్నప్పుడే వృత్తిలో రాణిస్తామన్నారు. బాల్యం నుంచే ఈ విలువైన లక్షణాలను అలవరుచుకోవాలన్నారు. చదువు, మార్కులకే పరిమితం కాకుండా జీవితానికి అవసరమైన వివిధ కౌశలాలను నేర్చుకోవాలని సూచించారు. జీవన నైపుణ్యాలలో భాగంగా స్వీయ అవగాహన, సమయపాలన, భావ వ్యక్తీకరణ, క్రమశిక్షణ వంటివి వ్యక్తిగత ప్రగతికి పునాదులుగా నిలుస్తాయన్నారు. విలువలతో కూడిన జీవన విధానం మానసిక ఆనందాన్ని కలిగించడమే కాకుండా సమాజంలో వ్యక్తిగత విలువను పెంచుతుందని తెలిపారు. ఎస్‌వోఎస్ లోకేషన్ ఇన్‌ఛార్జి సత్యనారాయణ, సహోద్యోగులు మునిరత్నం, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

పరశురామేశ్వరుడి సేవలో దేవదాయశాఖ కమిషనర్



దర్శనానంతరం రామచంద్ర మోహన్ కుటుంబీకులు

ఏర్పేడు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలో ప్రసిద్ధి చెందిన గుడిమల్లం పరశురామేశ్వరస్వామిని రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ రామచంద్ర మోహన్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా దేవదాయశాఖ అధికారి రామకృష్ణారెడ్డి, తిరుపతి తనిఖీ అధికారి ఫణిరాజశయన, ఆలయ ప్రధాన అర్చకుడు వంశీకృష్ణశర్మ, ఆలయ అర్చకుడు యోగేంద్ర పవన్‌కుమార్ శర్మ, సిబ్బంది పాల్గొన్నారు.

ముక్కంటి సేవలో ప్రముఖులు



దేవదాయ శాఖ కమిషనర్‌కు స్వామిఅమ్మవార్ల చిత్రపటాన్ని అందిస్తున్న ఈవో - స్వామి అమ్మవార్ల దర్శనానంతరం ఆలయ ధ్వజ స్తంభం వద్ద కుటుంబీకులతో జమ్మూకశ్మీర్ రెరా చైర్మన్, కేరళ కేరళ హైకోర్టు న్యాయమూర్తి



శ్రీకాళహస్తి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరుడిని శనివారం పలువురు ప్రముఖులు దర్శించుకున్నారు. రాష్ట్ర దేవదాయశాఖ కమిషనర్ రామచంద్రమోహన్, జమ్మూకశ్మీర్ రెరా చైర్మన్ సతీష్‌చంద్ర, కేరళ హైకోర్టు న్యాయమూర్తి సురేష్‌కుమార్ వేర్వేరుగా కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఈవో బాపిరెడ్డి వారికి స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శనానంతరం వేదపండితులు వారిని ఆశీర్వదించిస్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు.

అచ్చెనాయుడికి ఘనస్వాగతం



మంత్రికి స్వాగతం పలుకుతున్న ఎమ్మెల్యే నాని

రేణిగుంట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యవ సాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడికి తిరుపతి విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. ఉమ్మడి చిత్తూరు జిల్లా పర్యటనలో భాగంగా శనివారం మధ్యాహ్నం విజయవాడ నుంచి ఇండిగో విమానంలో తిరుపతి విమానాశ్రయానికి చేరుకోగా ఆయనకు చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, ఎంపీ ప్రసాదరావు, తుడా చైర్మన్ దివాకర్ రెడ్డి, యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహయాదవ్, టీడీపీ రాష్ట్ర మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, కోడూరు బాలసుబ్రహ్మణ్యం, నాదమునిరెడ్డి, మల్లం భాస్కర్‌రెడ్డి, ప్రభాకర్ ఆచారి, ఉమామహేశ్వర్ రెడ్డి తదితరులు స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గాన చంద్రగిరి నియోజకవర్గంలో జరిగే కార్యక్రమానికి బయలుదేరి వెళ్లారు.

అన్నదానానికి రూ.లక్ష విరాళం

సత్యవేడు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): నాగలాపురం మండలం సురుటుపల్లెలో కొలువైఉన్న పళ్లికొండేశ్వర స్వామి దేవస్థానంలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానానికి శ్రీకాళహస్తికి చెందిన రాజేశ్వరి, సుధాకర్‌రెడ్డి దంపతులు రూ.లక్ష విరాళం అందించారు. శనివారం ఆలయ ఈవో లతను కలిసి నగదును అందించారు.

శివరాత్రి రద్దీని తలపించిన ముక్కంటి క్షేత్రం



శ్రీకాళహస్తి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): భక్తుల రద్దీతో శ్రీకాళహస్తి క్షేత్రం మహాశివరాత్రిని తలపించింది. రెండో శనివారం, ఆదివారం వరుస సెలవులు రావడంతో పాటు వేసవి సెలవులు ముగియనుండడంతో ముక్కంటి ఆలయాన్ని దర్శించుకునేందుకు శనివారం భక్తులు ఒకసారిగా పోటెత్తారు. రెండు తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా దేశ నలుమూలల నుంచి భక్తులు విచ్చేశారు. శుక్రవారం రాత్రే పట్టణంలోని ప్రైవేటు లాడ్జీల్లోని అద్దె గదులు నిండిపోయాయి. శనివారం వేకువ జాము నుంచే ఆలయంలోని క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు. రద్దీ అధికంగా ఉండటంతో ఆలయ పరిసరాలు, సన్నిధివీధి, రాములవారి మందిరం, జలవినాయకుడి కూడళ్లల్లో పలు మార్లు వాహనాలు స్తంభించాయి. ఉదయం నుంచి రాత్రి వరకు సుమారు 35 వేలమంది స్వామిఅమ్మవార్లను దర్శించు కున్నట్లు అంచనా. రూ.500 రాహుకేతు పూజా టిక్కెట్లు 3,385, రూ.750 టిక్కెట్లు 1,578, రూ.1,500 టిక్కెట్లు 525, రూ.2,500 టిక్కెట్లు 329, రూ.5వేలు టిక్కెట్లు 132మంది భక్తులు కొనుగోల చేశారు.

రికార్డు స్థాయిలో అంతరాలయ దర్శనాలు

అంతరాలయ దర్శన టిక్కెట్లు శనివారం రికార్డుస్థాయిలో నమోదయ్యాయి. రూ.50 పూజా దర్శనం టిక్కెట్లు 4,951, ప్రత్యేక ప్రవేశ దర్శనం రూ.200 టిక్కెట్లు 2,903, అంతరాలయ దర్శనం ఎన్నడూ లేనంతగా గరిష్ఠ స్థాయిలో 831 టిక్కెట్లను భక్తులు కొనుగోలు చేశారు.

ట్రాఫిక్ ఉల్లం'ఘనులు'కు నోటీసుల జారీ



కొత్తపేటలో నోపార్కింగ్ బోర్డుల ఏర్పాటు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

శ్రీకాళహస్తి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించే వ్యాపారులకు పోలీసు అధికారులు నోటీసులు జారీ చేశారు. శనివారం ఆంధ్రజ్యోతిలో "ట్రాఫిక్ ఉల్లం 'ఘనులు" పేరిట కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. దీనిపై శ్రీకాళహస్తి డీఎస్పీ నరసింహమూర్తి స్పందించారు. ట్రాఫిక్ ఆంక్షలను అతిక్రమించే వ్యాపా రులపై చర్యలు తీసుకోవాలని ఆ విభాగం సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు కొత్తపేటలో ట్రాఫిక్ సిబ్బంది నో పార్కింగ్ బోర్డులను ఏర్పాటు చేశారు. అలాగే ట్రాఫిక్ అంతరాయం కారణ మవుతున్న వ్యాపారులకు నోటీసులు జారీ చేశారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వ్యాపారులకు హెచ్చరికలు జారీ చేశారు.

తాగునీటి కలుషితంతో బోరు ఏర్పాటు

● చొరవ చూపిన డిప్యూటీ సీఎం, ఎమ్మెల్యే



కృతజ్ఞతలు తెలుపుతున్న గ్రామస్తులు

శ్రీకాళహస్తి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): తొట్టంబేడు మండలంలోని చిలకావారి కండ్రిగలో తాగునీరు కలుషితం కావడంతో కొత్త బోరును ఏర్పాటు చేశారు. నీటిలో హానికరమైన రసాయనాలున్నాయని జనసేన తొట్టంబేడు మండల ప్రధాన కార్యదర్శి లక్ష్మణ్ తాగునీటి నమూనాలను తన సొంతఖర్చుతో ల్యాబ్‌లో పరీక్ష చేయించారు. అనంతరం రూరల్ వాటర్ డెవలప్‌మెంట్ అధికారులతో మాట్లాడి జియాలజిస్టును పిలిపించి చూపించారు. ఈ విషయాన్ని డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే సుధీర్ దృష్టికి తీసుకెళ్లారు. కేవలం 13రోజులకే స్పందించారు. దీంతో శనివారం చిలకావరికండ్రిగలో అధికారులు నూతన బోరును ఏర్పాటు చేశారు. దీంతో గ్రామస్తులు డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, ఎమ్మెల్యే సుధీర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. జనసేన నాయకులు పేట చంద్రశేఖర్, లక్ష్మణ్, పేట చిరంజీవి, మణి, మునిచంద్ర, గోపి, అల్లాబాషా, గ్రామస్తులు పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన ట్రైనీ ఐఏఎస్ అధికారులు

● పారిశ్రామికవాడ ప్రణాళిక, అమలు పట్ల ప్రశంస



శ్రీసిటీలో ట్రైనీ ఐఏఎస్ అధికారులు

వరదయ్యపాళెం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): ఏపీ దర్శన్ స్టడీ టూర్‌లో భాగంగా 2024 బ్యాచ్‌కు చెందిన ఏడుగురు ట్రైనీ ఐఏఎస్ అధికారులు శనివారం శ్రీసిటీని సందర్శించారు. శ్రీసిటీ సీనియర్ వైస్ ప్రెసిడెంట్(మార్కెటింగ్) శివశంకర్‌రెడ్డి వారికి సాదరస్వాగతం పలికారు. శ్రీసిటీ ప్రణాళిక, అత్యాధునిక మౌలిక సదుపాయాలు, సుస్థిర వృద్ధి నమూనాపై వారికి ప్రదర్శన ఇచ్చారు. మేక్ ఇన్ ఇండియా మిషన్‌లో శ్రీసిటీ పాత్ర, భారీ కల్పన, ఈ ప్రాంత ఆర్థిక వ్యవస్థకు ఊతం తదితరు అంశాలను వారికి వివరించారు. ట్రైనీ ఐఏఎస్ అధికారులు పారిశ్రామికవాడకు సంబంధించిన వివిధ అంశాలపై ఆరా తీశారు. మాండలేజ్(క్యాడ్‌బరీస్), డైకిన్ ఎయిర్ కండీషనింగ్ పరిశ్రమలను సందర్శించి అక్కడ ఉత్పత్తులు, పనితీరును పరిశీలించారు. ట్రైనీ ఐఏఎస్‌ల పర్యటన పట్ల శ్రీసిటీ ఎండీ రవీంద్ర సన్నారెడ్డి హర్షం వ్యక్తం చేశారు.

శ్రీసిటీకి రెడ్‌క్రాస్ పురస్కారం



శ్రీసిటీ అధికారులకు పురస్కారం అందిస్తున్న మంత్రి సత్యకుమార్

వరదయ్యపాళెం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): శ్రీసిటీ నిర్వహించిన రక్తదాన శిబిరం రాష్ట్రంలో అత్యుత్తమ రక్తదాన శిబిరాల్లో ఒకటిగా గుర్తింపు పొందింది. ఈ మేరకు 2025 ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆంధ్రప్రదేశ్ శాఖ నుంచి ఉత్తమపురస్కారం అందుకుంది. గుంటూరులోని భారతీయ విద్యాభవన్‌లో జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో రాష్ట్ర వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్ ఈ అవార్డును ప్రదానం చేశారు. శ్రీసిటీ ఫౌండేషన్ సీనియర్ మేనేజరు సురేంద్రకుమార్, ఇసుజు మోటర్స్ ఇండియా, యాక్సెలెంట్ ఫార్మసైన్స్ ప్రతినిధులు అవార్డును స్వీకరించారు. ఒకే శిబిరంలో అత్యధిక రక్తయూనిట్లు విభాగంలో శ్రీసిటీ రెండోస్థానంలో నిలిచింది. రెడ్‌క్రాస్ అవార్డు రావడం పట్ల శ్రీసిటీ డైరెక్టర్ నిరీషారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ప్రాణాలను కాపాడే లక్ష్యంతో చేపట్టిన ఈ బృహత్తర కార్యక్రమంలో చేతులు కలిపిన తమ ఉద్యోగులు, పరిశ్రమల కార్మికులందరికి కృతజ్ఞతలు తెలిపారు.

సిద్ధార్థ కళశాల విద్యార్థులకు ప్రశంస



నారాయణవనం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): అనుకోని ప్రమాదాల్లో గాయపడిన వారికి సరైన సమయంలో రక్తదానం చేయడంతో వారికి ప్రాణదాతలుగా మారిన విద్యార్థులందరికీ కృతజ్ఞతలు తెలుపుతూ తిరుపతి స్విమ్స్ ప్రశంసపత్రాలు అందజేసినట్లు సిద్ధార్థ డిప్లొమా ప్రిన్సిపాల్ రమేష్ తెలిపారు. శనివారం తిరుపతిలోని శ్రీపద్మావతి ఆడిటోరియంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవంలో యేటా స్విమ్స్ రక్తదాన కేంద్రానికి పుత్తూరు సిద్ధార్థ ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థులు రక్తదానం చేయడంపై హర్షిస్తూ ప్రశంస పత్రాలను అందజేశారు.

కల్వర్టును ఢీకొన్న కారు: డ్రైవర్ మృతి

రేణిగుంట, జూన్ 14, (ఆంధ్రజ్యోతి): కల్వర్టును కారు ఢీకొనడంతో డ్రైవర్ అక్కడికక్కడే మృతి చెందగా మరొకరు గాయపడ్డారు. ఈ సంఘటన శనివారం మధ్యాహ్నం నాయుడుపేట- పూతలపట్టు జాతీయ రహదారిలో జరిగింది. స్టేషన్ రైటర్ చలపతి తెలిపిన వివరాల మేరకు... శ్రీకాళహస్తి నుంచి తిరుపతికి వస్తున్న కారు అదుపు తప్పి కల్వర్టును ఢీకొనడంతో కాకినాడకు చెందిన డ్రైవర్ రాజు (51) అక్కడికక్కడే మృతి చెందగా కారులో ఉన్న మరొకరు గాయపడ్డారు. స్థానికుల సమాచారంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు క్షతగాత్రుడిని చికిత్స నిమిత్తం తరలించగా, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయా ఆసుపత్రికి తరలించారు.

విమాన ప్రమాద మృతులకు నివాళులు

రేణిగుంట, జూన్ 14 (రేణిగుంట): అహ్మదాబాద్‌లో జరిగిన విమాన ప్రమాదంలో మృతి చెందిన వారికి బీజేపీ నాయకులు నివాళులర్పించారు. శనివారం రాత్రి పట్టణంలోని గాంధీ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, వన్నియకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ తేజవతి, బీజేపీ నాయకులు ప్రేమ్, రాజా తదితరులు పాల్గొన్నారు.

రక్తదానంతో ప్రాణదానం



మునిచందును సత్కరిస్తున్న వైద్య బృందం

శ్రీకాళహస్తి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): రక్తదానంతో ప్రాణదానం చేయవచ్చని ఏఐఎస్ఎఫ్ నియోజకవర్గ కార్యదర్శి కె.మునిచందు అన్నారు. ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో పలుమార్లు కోగిలి మునిచందు రక్తదానం చేశాడు. శ్రీకాళహస్తి ప్రభుత్వాస్పత్రి సిబ్బంది గుర్తించి శనివారం మునిచందును వరల్డ్ బ్లడ్ డొనేషన్ డే సందర్భంగా సత్కరించారు. ఈ సందర్భంగా మునిచందు మాట్లాడుతూ... ఏఐఎస్ఎఫ్ అంటే కేవలం విద్యార్థుల సమస్యలపై పోరాటాలే కాదు... ప్రజాసేవలో కూడా ముందుంటుందన్నారు. ప్రస్తుత యువతలో కూడా రక్తదానం పట్ల అవగాహన కల్పించాలన్నారు.

పుత్తూరు వార్తలు

వైభవంగా శ్రీవారి రథోత్సవం



రథోత్సవం - అశ్వవాహన సేవ

వడమాలపేట, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పలాయగుంటలో కొలువై ఉన్న ప్రసన్న వేంకటేశ్వరస్వామి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం ఉదయం స్వామివారు రథాన్ని అధిరోహించి మాడవీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు. మంగళ వాయిద్యాలు, భజనలు, కోలాటాల నడుమ శ్రీవారి రథోత్సవం కనులపండుగగా సాగింది. భక్తులు ఉప్పు, మిరియాలు రథంపై చల్లి మొక్కులు చెల్లించారు. భక్తులు విశేషంగా గోవింద నామాలు పలుకుతూ రథాన్ని లాగుతూ ముందుకు నడిపించారు. అనంతరం స్వామి, అమ్మవార్లకు స్నపన తిరుమంజనం గావించారు. సాయంత్రం ఉభయ దేవేరులతో ప్రసన్న వేంకటేశ్వరుడిని సర్వాంగ సుందరంగా అలంకరించి ఊయలలో అధిష్ఠింపజేసి ఊంజల సేవ నిర్వహించారు. రాత్రి అశ్వవాహనంపై శ్రీవారు మాడవీధుల్లో విహరించారు. భక్తులు నారికేళ కర్పూర నీరజానాలు సమర్పించారు. డిప్యూటీ ఈవో హరీంద్రనాథ్, ఏఈవో దేవరాజులు, సూపరింటెండెంట్ శ్రీవాణి, ఆలయ అధికారి శివకుమార్, ఆలయ ప్రధాన అర్చకుడు సూర్యకుమారాచార్యులు, కంకణ భట్టార్ తిప్పయ్యఆచార్యులు తదితరులు పాల్గొన్నారు.

నేడు చక్రస్నానం

బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఈనెల 15న ఆదివారం చక్రస్నానం నిర్వహించనున్నారు. ఉదయం 9.15 నుంచి 10.30 గంటల మధ్య శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వేంకటేశ్వర స్వామి, చక్రత్తాళ్వార్లకు స్నపన తిరుమంజనం నిర్వహించనున్నారు. అనంతరం ఆలయం ఎదురుగా ఉన్న పుష్కరిణిలో 10.30-10.45 గంటల మధ్య చక్రస్నానం జరగనుంది.

శారీరక, మానసిక దృఢత్వానికి యోగా దోహదం





పుత్తూరు అర్బన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): శారీరక, మానసిక ఆరోగ్యాల్ని మెరుగుపరుచుకునేందుకు యోగా దోహదం చేస్తుందని మున్సిపల్ కమిషనర్ మంజునాథ్ గౌడ్ పేర్కొన్నారు. శనివారం స్థానిక తుడా పార్కులో నిర్వహించిన యోగా శిబిరానికి విశేష సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. కమిషనర్ మాట్లాడుతూ.. యోగాట ఒత్తిడిని అధిగమించడంతో పాటు ఏకాగ్రతను కూడా పెంపొందించుకోవచ్చన్నారు. మెరుగైన రక్త ప్రసరణ, నిద్ర, భావోద్వేగ స్థిరత్వం, సమగ్ర ఆరోగ్యం, బరువు నియంత్రణ, జీర్ణక్రియ మెరుగుదల, మధుమేహ నియంత్రణకు యోగా ప్రయోజనకారి అన్నారు. డీఈ చంద్రశేఖర్‌రెడ్డితో పాటు మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సత్వర ఉపాధికి పాలిటెక్నిక్ కోర్సులు ఉత్తమం

పుత్తూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): సత్వర ఉపాధికి పాలిటెక్నిక్ కోర్సులను చదవడం ఉత్తమమని పిళ్లారిపట్టు పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ కుమార్ అన్నారు. పాలిటెక్నిక్ కోర్సులకు ఈనెల 21 నుంచి 28 వరకు తిరుపతి, సత్యవేడు పాలిటెక్నిక్‌లలో జరగనుంది. ఈ నేపథ్యంలో ప్రిన్సిపాల్ మాట్లాడుతూ పాలిటెక్నిక్ విద్యార్థులే కావాలని పరిశ్రమలు కోరుతున్నాయని తెలిపారు. పిళ్లారిపట్టు పాలిటెక్నిక్‌లో సివిల్, కంప్యూటర్స్, ఎలక్ట్రానిక్స్, మెకానికల్ కోర్సులతో పాటు విశాలమైన భవనాలు, ల్యాబులు, ఎన్‌సిఏ సర్టిఫికెట్‌ను కలిగివున్నామని వివరించారు. ఇలాంటి సౌకర్యాలు ఉన్నందున తమ కళాశాలను విద్యార్థులు ఎంచుకోవాలని కోరారు.

వైభవంగా సంకటహర చతుర్థి

వడమాలపేట, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కల్యాణ గణపతి ఆలయంలో సంకటహర చతుర్థి సందర్భంగా శనివారం అభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం వినాయకుడికి అర్చన, గరికలతో సిందూర జలాభిషేకం నిర్వహించారు. స్వామివారిని పూలమాలలతో విశేషంగా అలంకరించారు. శని ప్రభావం ఉన్న వారితో అర్చనలు చేయించారు. తీర్థప్రసాదాలు అందజేశారు.

పుత్తూరు అర్బన్ (ఆంధ్రజ్యోతి): తొర్రూరులో కొలువైఉన్న వరసిద్ధి వినాయక ఆలయంలో సంకటహర చతుర్థి వేడుకలను వైభవంగా నిర్వహించారు. శనివారం సాయంత్రం 6 గంటలకు అభిషేకం జరిగింది. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుడిని ప్రజలు, విద్యార్థులు, యువత తరలివచ్చి దర్శించుకున్నారు.

బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో విమాన ప్రమాద ఘటన మృతులకు నివాళులు



పుత్తూరు అర్బన్, జూన్ 14(ఆంధ్రజ్యోతి): అహ్మదాబాద్‌లో చోటు చేసుకున్న విమాన ప్రమాదం అత్యంత బాధాకరమని గాయత్రి బ్రాహ్మణ సంఘ గౌరవ అధ్యక్షుడు ఆలూరి రామకృష్ణ, తిరుపతి బ్రాహ్మణ సంఘాల సమితి అధికార ప్రతినిధి బాలాజీశర్మ అన్నారు. ఈ ఘటనలో మృతి చెందిన వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని శనివారం కామాక్షి సమేత సదాశివేశ్వర స్వామిలో కొవ్వొత్తులతో నివాళులర్పించారు. మృతుల కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

అకాల వర్షం... వరికి అపార నష్టం



పిచ్చాటూరు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): మండలంలోని రామగిరిలో పంట చేతికొచ్చే దశలో శుక్ర, శనివారాల్లో కురిసిన వానకు వరికి అపార నష్టం జరిగింది. వారం రోజుల్లో కోత కోయాల్సిన పంట నేలకొరిగి నీటిపాలైంది. గింజలు పూర్తిగా నీటిలో నానుతుండడంతో మొలకలు వస్తాయేమోనని రైతులు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయ అధికారులు పొలాలను తనిఖీ చేసి తమకు సూచనలు, సలహాలు అందించడంతో పాటు నష్ట పరిహారం నమోదు చేయాలని రైతులు కోరుతున్నారు.

గోమాతకు అంత్యక్రియలు

ఏర్పేడు, జూన్ 14(ఆంధ్రజ్యోతి): గోమాతకు విక్రుతమాలలో శాస్త్రోక్తంగా అంత్యక్రియలు నిర్వహించారు. 20 సంవత్సరాల గోమాత 18 ఈతలు ఈనడం ద్వారా 9 పెయ్యి, 9 కోడె దూడలకు జన్మనిచ్చి పాలివ్వడం ద్వారా పాల డిపో శేఖర్‌యాదవ్‌కు ఆర్థికంగా ప్రయోజనం చేకూర్చింది. శనివారం గోవు మృతి చెందడంతో శేఖర్‌యాదవ్ కుటుంబసభ్యులతో పాటు చుట్టుపక్కల మహిళలు గోమాతకు పూజలు నిర్వహించి దహన సంస్కారాలు నిర్వహించారు. ఇన్నేళ్లు తమకు ఎంతో సాయంగా ఉన్న గోమాత మృతితో ఆ కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

రైలు కిందపడి వెండర్ మృతి

గూడూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): స్థానిక రైల్వేస్టేషన్‌లో శనివారం రైలులో నుంచి దిగుతూ ప్రమాదవశాత్తు జారిపడి ఓ వెండర్ మృతి చెందాడు. జీఆర్ పోలీసుల వివరాల మేరకు... స్థానిక రాణీపేట ప్రాంతానికి చెందిన చందు(36) రైల్వేస్టేషన్‌లో తినుబండారాలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తున్నాడు. తిరుపతి నుంచి పూరికి వెళుతున్న ఎక్స్‌ప్రెస్‌లో ప్రయాణికులకు తినుబండారాలు విక్రయించి కిందకు దిగుతుండగా ప్రమాదవశాత్తు జారి పడి మృతిచెందాడు. జీఆర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

తడ, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. స్థానిక నిప్పో పరిశ్రమ ఎదురుగా ఆటో మెకానిక్ షెడ్ నడుపుతున్న శివ శనివారం తాగునీరు తెచ్చుకునేందుకు బైక్‌పై నిప్పో వాటర్ ప్లాంట్ వద్దకు వెళ్లాడు. అక్కడ నీళ్లు పట్టుకొని తిరిగి వస్తుండగా బోడిలింగాలపాడు మలుపువద్ద చెన్నైకు చెందిన బాలాజీ, మనీష్ నెల్లూరుకు బైక్‌పై వెళ్తూ శివ బైక్‌ను ఢీకొట్టారు. ఈ ప్రమాదంలో రెండు బైక్‌పై ఉన్న ముగ్గురికి గాయాలపాలయ్యారు. క్షతగాత్రులను ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

పేకాట స్థావరంపై దాడి: ఐదుగురి అరెస్టు

కోట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చిట్టేడు పంచాయతీ మైక్రోటవర్ కాలనీ సమీపంలో ఉన్న జామాయిల్ చెట్ల వద్ద పేకాట స్థావరంపై శనివారం ఎస్‌ఐ పవన్‌కుమార్ దాడులు జరిపారు. పేకాట ఆడుతున్న ఐదుగురిని అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ.10,160 స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు.



అధ్వానంగా ఉన్న వీరారెడ్డిపల్లి రోడ్డు - చెన్నూరులోని రామలింగయ్య కాలనీ దారికి ఇరువైపులా ముళ్లచెట్లు

అధ్వానంగా గ్రామీణ రోడ్లు

గూడూరు, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు ప్రాంతాల్లో రోడ్లు అధ్వానంగా ఉన్నాయి. వర్షాల కారణంగా రోడ్లు బురదమయంగా మారడం, గుంతల్లో వర్షపునీరు నిల్వ చేరడంతో రాకపోకలకు ఇబ్బందులు పడాల్సి వస్తోంది. స్థానిక వీరారెడ్డిపల్లి ప్రాంతం నుంచి చెన్నూరు ప్రధాన రహదారికి రాకపోకలు సాగించే దారి మట్టి రోడ్డు కావడంతో స్థానికులు అవస్థలు పడుతున్నారు. వీరారెడ్డిపల్లి ప్రాంతం నుంచి పట్టణంలోకి వచ్చేవారు ఎక్కువగా ఈ మార్గం ద్వారానే రాకపోకలు సాగిస్తుంటారు. వర్షాకాలం బురదమయంగా మారి ప్రయాణం కష్టతరంగా ఉందని గ్రామస్తులు చెబుతున్నారు. అదేవిధంగా మండలంలోని చెన్నూరు గ్రామంలోని రామలింగయ్య కాలనీ, జగనన్న కాలనీలకు వెళ్లే ప్రధాన మార్గం మట్టిరోడ్డు కావడంతో పాటు దారికి ఇరువైపులా ముళ్లచెట్లు పెరిగిపోవడంతో రాకపోకలు సాగించే ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ముళ్లచెట్లు పెరిగిపోవడంతో విషసర్పాల సంచారం ఎక్కువగా ఉందని, రాత్రివేళల్లో చీకటిగా ఉండడంతో ప్రయాణించడానికి ఇబ్బందిగా ఉందని చెబుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి రోడ్లను అభివృద్ధి పరచాలని ప్రజలు కోరుతున్నారు.

కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వాస్పత్రుల్లో వైద్యసేవలు : డీఎంహెచ్‌వో

ఓజిలి, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వాస్పత్రుల్లో కార్పొరేట్ దీటుగా వైద్యసేవలు అందించాలని డీఎంఅండ్‌హెచ్‌వో బాలకృష్ణనాయక్ అన్నారు. ఓజిలి ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని ఆయన శనివారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్యసేవల గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ప్రభుత్వాస్పత్రిలో అత్యాధునికమైన ల్యాబ్‌తో పాటు మందులు ఇతర వసతులను సమకూర్చి రోగులకు మెరుగైన వైద్యసేవలు అందిస్తున్నామన్నారు. వైద్య సిబ్బంది ఎల్లప్పుడూ రోగులకు అందుబాటులో ఉంటూ సేవలు అందించాలని సూచించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల్లో అలసత్వం వహిస్తే సహించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో అధికారులు శ్రీనివాసులురెడ్డి, డీపీఎంవో శ్రీనివాసరావు, వైద్యాధికారి డానియేల్, హిమజ సిబ్బంది పాల్గొన్నారు.

'తోతాపురి'కి మద్దతు ధర ఇవ్వాల్సిందే

- సిండికేటయి రైతులను ఇబ్బందిపెడితే చర్యలు
- మంత్రి అచ్చెన్నాయుడు



మంత్రి అచ్చెన్నాయుడు, ఎమ్మెల్యే నాని, కలెక్టర్ వెంకటేశ్వర్‌ను తోతాపురి మామిడి మాలతో సత్కరిస్తున్న రైతులు

పాకాల, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): రైతులకు మేలు చేయాలనే ఉద్దేశంతో తోతాపురి టన్నుకు ప్రభుత్వం రూ.4వేలు చెల్లిస్తోందని, గుజ్జు పరిశ్రమలు, వ్యాపారులు రూ.8వేలు ఇవ్వాలని నిర్ణయించామని, దీన్ని అతిక్రమిస్తే చర్యలు తప్పవని వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు హెచ్చరించారు. మండలంలోని దామలచెరువు మ్యాంగోనగర్‌లో శనివారం మామిడి రైతులు, వ్యాపారులతో ఆయన సమావేశమయ్యారు. సాకులు చెప్పడం మానేసి తోతాపురి కొనుగోలు చేసి గుజ్జు పరిశ్రమలు ప్రాసెసింగ్ ప్రారంభించాలన్నారు. రైతులకు గిట్టుబాటు ధర లభించడానికి పొగాకుకు రూ.350 కోట్లు, కోకోకు రూ.12కోట్లు, తోతాపురి మామిడికి రూ.167 కోట్లు ప్రభుత్వం కేటాయించిందని వెల్లడించారు. మారుతున్న కాలానికి అనుగుణంగా రైతులు డిమాండ్ ఉన్న టేబుల్ రకాలు పండించడానికి ముందుకు రావాలన్నారు. చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు మాట్లాడుతూ పల్ప్ 60-65శాతం ఎగుమతులపైనే ఆధారపడినందున సమస్యలు తలెత్తాయన్నారు. దేశీయంగా వినియోగం పెరిగేలా టీటీడీ అన్నదానంలో, అంగన్‌వాడీ, పాఠశాలల్లో మ్యాంగో జ్యూస్ ఇవ్వగలిగితే కొంత వరకు సమస్య పరిష్కారమవుతుందన్నారు. ఎమ్మెల్యే పులివర్తి నాని మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో ముగ్గురు గుజ్జు పరిశ్రమల యజమానులు సిండికేటయిన కారణంగా తోతాపురికి గిట్టుబాటు ధర రావడం లేదని, ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. చిత్తూరు ఎమ్మెల్యే జగన్‌మోహన్ మాట్లాడుతూ గుజ్జు పరిశ్రమల మనుగడ కోసం రైతులను కాపాడుకోవాలన్నారు. పూతలపట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ మాట్లాడుతూ జిల్లాలో మామిడి పరిశోధన కేంద్రం ఏర్పాటు చేసి రైతులకు తగిన సలహాలు సూచనలు ఇవ్వాలన్నారు. కలెక్టర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్ మాట్లాడుతూ ఈ ఏడాది తోతాపురి దిగుబడి పెరగడం, గత ఏడాది పల్ప్ ఫ్యాక్టరీలలో స్టాకు ఉండడంతో ఈ పరిస్థితి తలెత్తిందన్నారు. ఈ సమావేశంలో ఉద్యానశాఖ డైరెక్టర్ శ్రీనివాస్, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, జిల్లా ఉద్యాన శాఖ అధికారి దశరథరామిరెడ్డి, ఆర్డీవో రామ్మోహన్, వివిధ శాఖల అధికారులు మండల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

లారీ నుంచి పడి కూలి మృతి

మరొకరు పరిస్థితి విషమం



భాస్కర్ మృతదేహం

రేణిగుంట, జూన్ 14 (ఆంధ్రజ్యోతి): లారీ నుంచి కిందపడి కూలి మృతి చెందగా మరొక పరిస్థితి విషమంగా ఉంది. గాజులమండ్యం ఎస్‌ఐ సుధాకర్ తెలిపిన వివరాల మేరకు... వడమాలపేటకు చెందిన భాస్కర్, రషీద్ గాజులమండ్యం పారిశ్రామికవాడలోని శ్రీనిధి రాజా ప్యాకింగ్ ప్రైవేట్ లిమిటెడ్ కర్మాగారంలో లోడింగ్ చేస్తుంటారు. శనివారం మధ్యాహ్నం లారీలో లోడ్ చేస్తుండగా భాస్కర్(53) కళ్లు తిరిగి లారీ నుంచి కిందపడుతండగా రషీద్ కాపాడేప్రయత్నం చేశారు. ఈక్రమంలో ఇద్దరూ కింద పడటంతో, అక్కడే ఉన్న సిబ్బంది గమనించి చికిత్స నిమిత్తం అమర హాస్పిటల్‌కు తరలించారు. అప్పటికే భాస్కర్ మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. రషీద్ పరిస్థితి విషమంగా ఉంది.

ప్రధాన రహదారిపై నీటి నిల్వ



కేవీబీపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రధాన రహదారిలో వారపు సంత వద్ద కొద్దిపాటి వర్షం వచ్చినా నీరు నిల్వ చేరి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. ఇందుకు సంబంధించి రోడ్డు పక్కన ఉన్న ఆర్‌అండ్‌బీ ఏర్పాటు చేసిన డ్రైనేజీ కాలువను కొంతమంది పూడ్చివేయడంతో ఆ నీరు వెళ్లే మార్గం లేక రోడ్డుపై నిల్వ చేరుతోంది. రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో దుర్వాసన వస్తోంది. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అర్‌అండ్‌బీ అధికారుల స్పందించి ఆక్రమణకు గురైన డ్రైనేజీ కాలువను తవ్వించి రోడ్డుపై నిల్వ నీరు లేకుండా చూడాల్సి ఉంది.

పాఠశాలను విలీనం చేయొద్దు



నిరసన వ్యక్తం చేస్తున్న తల్లిదండ్రులు

కేవీబీపురం, జూన్ 14(ఆంధ్రజ్యోతి): పాఠశాలల విలీనం వద్దంటూ మండలంలోని జ్ఞానాంబ కండ్రిగవాసులు శనివారం పాఠశాల వద్ద నిరసన వ్యక్తం చేసి తాళం వేశారు. ఈ పాఠశాలలో 1వ తరగతి నుంచి 5 వరకు సుమారు 39 మంది చదువుకుంటున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం పాఠశాలలను విలీనం చేయడంతో ప్రధాన రహదారిపై 4 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఆరె గ్రామానికి తమ పిల్లలను పంపమని వారు నిరసన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి దీనిపై చర్యలు తీసుకుని తమ గ్రామంలోని పాఠశాలను కొనసాగించాలని కోరుతున్నారు.

తిరుపతిపై రైల్వేల చిన్నచూపు

జీఎం సార్.. వింటారా ఈ గోడు ● నేడు దక్షిణకోస్ట్ రైల్వే జీఎం సందీప్ మాథూర్ రాక

తిరుపతి (సెంట్రల్) జూన్14(ఆంధ్రజ్యోతి): దక్షిణమధ్యరైల్వేలో భాగంగా ఉన్న తిరుపతి జిల్లా తీవ్ర వివక్షకూ, నిరాదరణకూ గురవుతోందనే బాధ ఈ ప్రాంత ప్రజల్లో ఉంది. ప్రపంచ ప్రసిద్ధ హిందూ క్షేత్రం ఉన్న తిరుపతికి దేశం నలుమూలల నుంచీ ప్రయాణీకుల రాకపోకలు ఉంటాయి. ఆదాయమూ ఉంటుంది. అయినా అభివృద్ధి వాటాలో మాత్రం ఈ ప్రాంతం అలక్ష్యానికి గురవుతోంది. తిరుపతి రైల్వేస్టేషన్, రేణిగుంట జంక్షన్‌లకు సంబంధించిన ప్రతిపాదనలు ఏళ్ల తరబడి అతీగతీ లేకుండా మగ్గుతున్నాయి. ఆదివారం జిల్లాకు వస్తున్న దక్షిణ కోస్ట్ రైల్వే కొత్త జనరల్ మేనేజర్ సందీప్ మాథూర్ మీద ప్రజలు కోటి ఆశలతో ఉన్నారు. అధికారులతో ఆయన సమీక్షించి తగిన చర్యలు తీసుకుంటారనే నమ్మకంతో ఉన్నారు. జిల్లా ప్రజలు అనేక ఏళ్లుగా కోరుతున్నవి ఇవీ..

రేణిగుంట స్టేషన్‌లో రైళ్లకి చోటులేదు: రేణిగుంట రైల్వేస్టేషన్ రోడ్డు నంబరు ఒకటి(ప్లాట్ ఫారం ఒకటి) నుంచి గూడూరు వైపు వెళ్లే రైలు మార్గాన్ని కలుపుతూ చేపట్టాల్సిన రైలు మార్గం అనుసంధానం పనులు 20 ఏళ్లుగా జరుగుతూనే ఉన్నాయి. ఈ పనులకోసం నిర్మించిన బ్రిడ్జి శిథిలావస్థకు చేరుకొనే స్థాయికి వెళ్లింది.రేణిగుంట రైల్వే జంక్షన్‌లో మరో టెర్మినల్ చేయాలి. ప్లాట్ ఫారాలు ఖాళీ లేక రాత్రి సమయాల్లో పొలిమేర్లలో ఎక్స్‌ప్రెస్ రైళ్ళు గంటల తరబడి వేచివుండవలసి వస్తోంది. ఇది రైళ్లలో చోరీలు చేసే ముఠాలకు అనువుగా మారింది. రేణిగుంటసంత వద్ద గేటు నెంబరు (112) స్థానంలో అండర్ బ్రిడ్జిలు నిర్మించాల్సి ఉంది.

- భారత రైల్వేలో ఏగ్రేడ్-1 రైల్వేస్టేషన్లలో ఒకటైన తిరుపతిలో బాలాజీ డివిజన్ ఏర్పాటు కలగానే మిగిలింది.
- తిరుపతిలోనూ రైల్వేస్టేషన్‌లో నిర్మాణ పనులు సాగుతూనే ఉన్నాయి. వేలాది మంది ప్రయాణించే ఈ స్టేషన్‌లో ప్రజలు ముప్పుతిప్పలు పడుతున్నారు.
- తిరుచానూరు రైల్వేస్టేషన్ నిర్మాణాలు నత్తలతో పోటీ పడుతున్నాయి. దీనిని ప్రయాణికులకు ఎప్పుడు అందుబాటులోకి తెస్తారో తెలియదు.
- తిరుపతి పడమటి రైల్వేస్టేషన్‌వద్ద రేల్ కళ్యాణ్ మండపం నిర్మాణాలు కూడా ఎంతకీ పూర్తికావడం లేదు.
- పుణ్యక్షేత్రాల మధ్య మెము ప్యాసింజర్ రైళ్ళు నడపాలి.
- తిరుపతి-రేణిగుంటల మధ్య మూడవ రైలు మార్గం ఏర్పాటు చేయాలి.
- చంద్రగిరి రైల్వేస్టేషన్‌ను అభివృద్ధి చేయాలి.
- సీఆర్‌ఎస్ సామర్థ్యం పెంచాలి.
- తిరుపతి వెస్ట్ రైల్వేస్టేషన్ అభివృద్ధి చేయాలి. ప్యాసింజర్ రైళ్ళను అక్కడ నుంచే నడిపేవిధంగా అభివృద్ధి పనులు చేపట్టాలి.
- పాకాల రైల్వే జంక్షన్‌రు తగిన ప్రాధాన్యత కల్పించి అభివృద్ధి పనులు చేపట్టాలి.

కొత్త రైల్వే జీఎం పర్యటన ఇలా

విశాఖపట్టణంలో నూతనంగా రైల్వేజోన్ ఏర్పాటు చేసిన అనంతరం దక్షిణ కోస్ట్ రైల్వే జనరల్ మేనేజరుగా బాధ్యతలు తీసుకున్న సందీప్ మాథూర్ విశాఖపట్టణం నుంచి ఆదివారం రాత్రి రేణిగుంటకు చేరుకుంటారు. సోమవారం ఉదయం తిరుమలకు వెళ్ళి శ్రీవారిని దర్శించుకుంటారు. తర్వాత తిరుపతికి చేరుకొని రైల్వే స్టేషన్‌ను పరిశీలిస్తారు.

పూడి-ఏర్పేడు మధ్య కొత్త రైలు మార్గం

- రూ490.97 కోట్లు మంజూరు
- రైల్వే జంక్షన్‌గా పూడి



పూడి రైల్వేస్టేషన్

తిరుపతి (సెంట్రల్)జూన్14(ఆంధ్రజ్యోతి): దక్షిణ మధ్య రైల్వే, దక్షిణ రైల్వేల మధ్య వున్న పూడి-ఏర్పేడు రైల్వేస్టేషన్ల మధ్య నూతన రైలు మార్గం ఏర్పాటు చేయడానికి రైల్వే బోర్డు రూ490.97 కోట్లు నిధులు మంజూరు చేసింది. రెండు స్టేషన్ల మధ్య 25.4 కిలో మీటర్లు రైలు మార్గం వేస్తారు. నాలుగేళ్లలో దీనిని పూర్తి చేస్తారు. దక్షిణ భారత దేశం నుంచి ఉత్తర భారత దేశంలోని ప్రధాన నగరాలకు తక్కువ సమయంలో వస్తురవాణా చేయడానికి రైల్వే బోర్డు ఈ నూతన రైలు మార్గాన్ని ఏర్పాటు చేయడానికి నిర్ణయం తీసుకుంది. దీంతో పూడి రైల్వే స్టేషన్ కూడా జంక్షన్ కానుంది. ఈ మార్గంలో చెల్లూరు సమీపంలో ఒక రైల్వేస్టేషన్ కూడా వస్తుంది. ఈ రైలు మార్గం పూర్తి చేస్తే రేణిగుంట రైల్వే జంక్షన్‌లో రైళ్ళ రాక పోకల ఒత్తిడి తగ్గుతుంది. ఈ ప్రాంతం నుంచి రైతులు పండించే ఉత్పత్తులు దూరప్రాంతాలకు రవాణా చేసే అవకాశాలు పెరుగుతాయి. రేణిగుంట,ఏర్పేడు మండలాల్లో వున్న భారీ పరిశ్రమల ఉత్పత్తులు కూడా రవాణా చేయడానికి అనుకూలంగా వుంటుంది.

వైసీపీ మిగిల్చిన చెత్త,రుణాన్ని క్లియర్ చేస్తున్నాం

●పురపాలక మంత్రి నారాయణ



తిరుపతి, జూన్4(ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వం 85 లక్షల టన్నుల చెత్తను, రూ.10 లక్షల కోట్ల అప్పును వదిలేసి వెళ్లిందని, దార్శనికత ఉన్న సీఎం చంద్రబాబు ఈ చెత్తను, అటు రుణాన్ని క్లియర్ చేసే బాధ్యత తీసుకున్నారని రాష్ట్ర పురపాలక శాఖ నారాయణ అన్నారు. శుక్రవారం ఆయన రామాపురం డంపింగ్ యార్డ్‌ను ఏపీజీబీసీ చైర్మన్ సుగుణమ్మ, యాదవ్ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, మున్సిపల్ అధికారులు తదితరులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఇప్పటివరకు 45 లక్షల టన్నుల చెత్తను క్లియర్ చేశామన్నారు. రాబోయే మూడు నెలలలో 35 లక్షల టన్నుల చెత్తను క్లియర్ చేయడానికి వేగవంతంగా చర్యలు చేపడుతున్నామని తెలిపారు. తిరుపతి జిల్లాలో జిగ్మా కంపెనీ రోజుకు 900 టన్నుల చెత్తను క్లియర్ చేస్తున్నారన్నారు. ఈక్రమంలోనే పరిశీలించేందుకు వచ్చామన్నారు.ఆర్థికంగా రాష్ట్రం ఎంత కష్టంలో ఉన్నప్పటికీ ఇచ్చిన హామీల అమలుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో నగరపాలక సంస్థ డీసీ అమరయ్య, ఎంఈ గోమతి పాల్గొన్నారు.

నాగలాపురం పీహెచ్‌సీలో ఆటాపాట

బయటి వ్యక్తులతో కలిసి సిబ్బంది డాన్స్ వీడియోలు వైరల్



పీహెచ్‌సీలో బయటి వ్యక్తులతో కలిసి డ్యాన్సులు వేస్తున్న సిబ్బంది

తిరుపతి(వైద్యం), జూన్ 14(ఆంధ్రజ్యోతి): సత్యవేడు నియోజకవర్గ పరిధిలోని పిచ్చాటూరు, నాగలాపురం పీహెచ్‌సీల్లో శుక్రవారం బ్లాక్ లెవల్ పబ్లిక్ హెల్త్ యూనిట్(బీఎల్‌పీహెచ్‌యూ)ను డీఎంహెచ్‌వో బాలకృష్ణ నాయక్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే ఆదిమూలం ప్రారంభించారు. ఈ కార్యక్రమం ముగిసిన తర్వాత నాగలాపురం ప్రాథమిక వైద్యశాల(పీహెచ్‌సీ) సిబ్బంది కొందరు బయటి వ్యక్తులతో కలిసి ఏకంగా ఆస్పత్రిలోనే పాటలు పాడుతూ డ్యాన్సులు వేయడం విమర్శలకు తావిచ్చింది. ప్రస్తుతం ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ విషయంపై ఆంధ్రజ్యోతి డీఎంహెచ్‌వో బాలకృష్ణనాయక్‌ను వివరణ కోరగా ఈ విషయం మా దృష్టికి రాలేదని అయినా పీహెచ్‌సీలో అనధికారికంగా ఆటపాటల వంటి కార్యక్రమాలు నిర్వహించకూడదని దీనిపై పూర్తి స్థాయిలో విచారణ చేపట్టి ఇందుకు కారకులపై తప్పక చర్యలు తీసుకుంటామన్నారు.

వేదోక్తంగా శనీశ్వరస్వామికి తైలాభిషేకం

శ్రీకాళహస్తి, జూన్ 14(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో కొలువై ఉన్న శనీశ్వరుడికి శనివారాన్ని పురస్కరించుకుని వేదోక్తంగా పూజలు నిర్వహించారు. స్వామిఅమ్మవార్ల అభిషేకం అనంతరం శనీశ్వరస్వామి సన్నిధిలో కలశ ప్రతిష్ఠ చేసి మొదట గణపతి, కలశ పూజలను చేశారు. అనంతరం స్వామివారిని నువ్వుల నూనె, పాలు, పెరుగు, చందనం, నారికేళం, కలశ జలాలతో అభిషేకించారు. అనంతరం పుష్పాలతో విశేషంగా అలంకరించి ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.